

త్రివేణి సంగమం వద్ద పుష్కరిణికి పూజలు చేస్తున్న భక్తులు

పుష్కర భక్తులతో సందడిగా కాళేశ్వర త్రివేణి సంగమం



ఓ యువతి భక్తి తన్మయత్వం

సరస్వతీ.. నమో నమామి

- పుష్కర శోభితమైన కాళేశ్వరం
- 'అంతర్వాహిని' చెంతకు తరలొస్తున్న భక్తులు
- తొలి రోజుతో పోలిస్తే రెండో రోజు రెట్టింపైన సంఖ్య
- సుమారు 50వేల మంది వచ్చినట్టు అంచనా
- సతీసమేతంగా పుణ్యస్నానమాచరించిన డిప్యూటీ సీఎం
- సరస్వతీ మాతకు పూజలు.. నదీ హారతికి హాజరు

7



పుష్కరమాతకు నవరత్న హారతి సమర్పిస్తున్న కాశీ పండితులు



త్రివేణి సంగమం వద్ద పుష్కరిణికి చీరసారె సమర్పించి పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నందిని దంపతులు

'టీజీ కాస్ట్' నిధుల్లో.. గోల్‌మాల్!

వరంగల్ సైన్స్ సెంటర్ ఎస్సీ, ఎస్టీ సెల్‌లో అక్రమాలు



సైన్స్ సెంటర్‌లో ప్రత్యేకంగా నిర్మించిన ఎస్సీ, ఎస్టీ సెల్ భవనం (ఫైల్)

తాళం వేసి ఉన్న ఎస్సీ, ఎస్టీ సెల్ కార్యాలయం



వరంగల్ సైన్స్ సెంటర్‌కు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (డీటీఎస్) కేటాయించిన నిధులు దారి తప్పుతున్నాయి. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల ఆర్థిక, సామాజిక, విద్య, ఆరోగ్య స్థితిగతులపై పరిశోధనల కోసం శాస్త్ర, సాంకేతిక మండలి (టీజీ కాస్ట్) ద్వారా వరంగల్ సైన్స్ సెంటర్‌కు డీటీఎస్ రూ.8.08కోట్లు కేటాయించింది. అయితే ఆ నిధులు దారి తప్పుతుండటంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. సర్వేలు, డిజైన్ల కోసం ఎంపిక చేసిన ఏజెన్సీలకు పూర్తి స్థాయిలో పనులు కాకుండానే బిల్లులు చెల్లించటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటితో పాటు పరిశోధనలకు ఎటూ వెళ్లకుండానే రవాణా ఖర్చుల పేరుతో లక్షలాది రూపాయలు డ్రా చేయటం, పరిశోధనలు చేస్తామని అడిగిన ప్రాజెక్టు ఉద్యోగులను తొలగిస్తుండటం గమనార్హం. పైగా ప్రాజెక్టు పూర్తయిందని ఎస్సీ, ఎస్టీ సెల్ కార్యాలయానికి తాళం వేయటంపై ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సైన్స్ సెంటర్ పాత భవనాన్ని పూర్తి చేసేందుకు రూ.1.60కోట్లు కేటాయింపుల్లో అవకతవకలు జరిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇంత జరుగుతున్నా సైన్స్ సెంటర్ చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ దీనిపై దృష్టి సారించకపోవటం చర్చనీయాంశమైంది.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

ఎస్సీ, ఎస్టీల జీవన విధానం, ఆర్థిక స్థితిగతులు, విద్యా, ఆరోగ్యం తదితర వాటిపై పరిశోధనలు చేసేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నాలేజీ, సైన్స్(డీటీఎస్) తెలంగాణ శాస్త్ర, సాంకేతిక మండలి (టీజీ కాస్ట్)కి రూ.8,08,92,521 కేటాయించింది. టీజీ కాస్ట్ తెలంగాణలో ఉన్న ఏకైక సైన్స్ సెంటర్, వరంగల్ ద్వారా 2022లో ఈ పరిశోధనలు చేయించేందుకు నిధులను మళ్లించింది. ఈ పథకాన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని డీటీఎస్ నిబంధనలు పెట్టింది. ఈ ప్రాజెక్టు కిందనే వరంగల్ సైన్స్ సెంటర్‌లో ఎస్సీ, ఎస్టీ సెల్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచే రాష్ట్ర వ్యాప్తంగా పరిశోధనలు చేపట్టారు. నెలకు రూ.60వేల వేతనంతో ప్రాజెక్టు కోఆర్డినేటర్, ఒక్కొక్కరికి రూ.42వేల వేతనంతో ఇద్దరు సీనియర్ ప్రాజెక్టు అసిస్టెంట్లు, ఒక్కొక్కరికి రూ.20వేల వేతనంతో ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక్కొక్కరికి రూ.15వేల వేతనంతో ఇద్దరు ఫీల్డ్ వర్కర్లు మొత్తం ఏడుగురు ఉద్యోగులను తీసుకునేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి మూడేళ్ల కాలంలో రూ.87,75,360 చెల్లించేలా డీటీఎస్ ఉత్తర్వులిచ్చింది.

పరిశోధనలు పూర్తి కాకుండానే బిల్లులు

ఎస్సీ ఎస్టీలు మెరుగైన జీవితాన్ని గడపడానికి, విద్యా, ఆరోగ్యం, పరిశుభ్రత, వ్యవసాయ ఉత్పత్తి పెంచడానికి, మురుగునీటిని తొలగింపు తదితర కార్యక్రమాలు, చేతి పనులు వ్యాపారం, అటవీ ఉత్పత్తులపై శిక్షణ, ఎస్సీ, ఎస్టీ చేతివృత్తుల వారిలో నైపుణ్యాభివృద్ధి తదితర వాటిపై పరిశోధనలు చేసేందుకు ప్రత్యేకంగా ఏజెన్సీలను ఎంపిక చేశారు. వరంగల్ సైన్స్ సెంటర్ పర్యవేక్షణలో ఎస్టీల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) యూనివర్సిటీకి రూ.72,25,394, ఎస్సీల స్థితిగతులపై పరిశోధనలు చేసేందుకు టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ స్టడీస్ (టిస్)కు రూ.39,37,439 కేటాయించారు. అయితే ఇందులో ఎస్టీలపై అధ్యాయనం చేసి, ప్రాజెక్టు రిపోర్టును సెస్ ఏజెన్సీ టీజీ కాస్ట్‌కు నివేదికను అందించింది. అయితే ఇది డీటీఎస్ ఆశించిన స్థాయిలో లేకపోవటంతో రీ సర్వే చేసి కొత్త సర్వే రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. రీ సర్వే రిపోర్టును ఇప్పటి వరకు సెస్ ఇవ్వలేదు. టిస్ మొత్తానికి సర్వేనే పూర్తి చేయలేదని ఉద్యోగులు చెబుతున్నారు. అయితే ఈ రెండు ఏజెన్సీలకు పూర్తి స్థాయిలో

మిగతా 6వ పేజీలో...

- ఎస్సీ, ఎస్టీల స్థితిగతులపై సర్వే ప్రణాళిక కోసం రూ.8.08కోట్లు కేటాయింపు
- పనులు పూర్తి కాకుండానే సర్వే ఏజెన్సీలకు పూర్తిస్థాయిలో బిల్లుల చెల్లింపు
- ఏడుగురు ఉద్యోగుల నియామకం.. రీసెర్చ్‌లకు వెళ్లనివ్వకుండా అడ్డంకులు
- ప్రశ్నించిన ఉద్యోగులపై తొలగింపు వేటు.. ఇక మిగిలింది ఇద్దరే
- ప్రాజెక్టు పూర్తయిందంటూ కార్యాలయానికి తాళం
- బిల్డింగ్‌కు రూ.1.60కోట్లు.. పాత భవనం పేరుతో రూ.50లక్షలు మాయం
- సైన్స్ సెంటర్‌లో చక్రం తిప్పుతున్న ఓ అధికారి
- రాష్ట్రంలోనే ఏకైక సైన్స్ సెంటర్ నిర్వహణపై దృష్టి పెట్టని కలెక్టర్

అనుబంధ కళాశాలలు న్యాక్‌కు సిద్ధం కావాలి

- కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- ఓయూ, శాతవాహన వర్సిటీల ఎంఓయూ

6

చివరి గింజ వరకు ధాన్యం కొంటాం

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, ఇతర అధికారులు

వరంగల్ కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్‌లతో కలిసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టామని, సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తున్నామని అన్నారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి కేంద్రాల వద్ద గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని మంత్రి సూచించారు. అనంతరం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో 182 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2024-25 రబీ సీజన్‌లో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అంచనా వేయగా ఇప్పటి వరకు 87వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయడంతోపాటు నిత్యం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీసీవో నీరజ, డీఏవో అనురాధ, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, సివిల్ సప్లయీస్ డీఎం సంధ్యారాణి, డీఎస్‌వో కిష్టయ్య పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి
- పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ
- దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో సమావేశాలు

దుగ్గొండి, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని, రాబోయే స్థానిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పిలుపునిచ్చారు. మండలంలోని గిర్నిబావిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి ఎర్రబెల్లి స్వర్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ.. నర్సంపేట నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను నియోజకవర్గ ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పీసీసీ సభ్యుడు పెండెం రామానందం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొకల శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రెల బాబు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగి నర్సింగరావు, మండల ప్రధాన కార్యదర్శి ఎర్రెల్లి శ్రీనివాస్‌రెడ్డి, చుక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నల్లబెల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి, చిత్రంలో స్వర్ణ

సంస్థాగత ఎన్నికల్లో సైనికుల్లా పని చేయాలి : దొంతి

సంస్థాగత ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేసి విజయం సాధించాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పిలుపునిచ్చారు. నల్లబెల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సంస్థాగత ఎన్నిల సన్నాహక సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరి కృషితో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం సఫలకృతమైందన్నారు. అదే స్ఫూర్తితో స్థానిక ఎన్నికల్లో అందరూ సమన్వయం పాటించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు నాంది పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, కిసాన్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, శివారెడ్డి, రఘుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- శాంతి భద్రతలను పాటించాలి
- సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- జనగామ ఏసీపీ కార్యాలయం, చిలుపూర్ పీఎస్‌ల పరిశీలన

6



జనగామలోని ఏసీపీ కార్యాలయంలో సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న సీపీ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పుష్కర నిధులు ఏమయ్యాయి?

రూ.25కోట్లిచ్చినా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి

విలేకరుల సమావేశంలో బీజేపీ నేతలు

కాళేశ్వరం, మే 16(ఆంధ్రజ్యోతి): పుష్కరాలకు ప్రభుత్వం రూ.25కోట్లు మంజూరు చేసిన పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న మాదిరిగా ఉందని నిధులు ఎమయ్యాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చంద్రుపట్ల కీర్తిరెడ్డి, రాష్ట్ర నాయకులు చల్ల నారాయణ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం మహాదేవపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చుట్టూ ఉన్న నాలుగు రాష్ట్రాల నుంచి లక్షల్లో భక్తులు వస్తారని తెలిసి సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయక పోవడం సరైందికాదన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు సంజీవ రెడ్డి, నిశిధర్‌రెడ్డి, మండల అధ్యక్షులు మనోజ్, రంజిత్, పూర్ణచందర్, శ్రీకాంత్, నాయకులు శ్రీధర్, మహేష్, కిషన్, శ్రీనివాస్, రవి, శంకర్, వెంకటేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మాలాధారుల ఆందోళన

ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో చెలరేగిన గొడవ

చర్యలు తీసుకోవాలని నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నర్సంపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆటో, బైక్ ఢీకొనడంతో కిందపడిపోయిన ద్విచక్రవాహనదారుడు హనుమాన్ మాలధారణలో ఉన్న ఆటోడ్రైవర్‌పై చేయి చేసుకోవడంతో గొడవకు దారి తీసింది. ఈ సంఘటన నర్సంపేట పట్టణంలో శుక్రవారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. హనుమాన్ మాలధారణలో ఉన్న నర్సంపేట పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ చప్పల రేవంత్ తన ఆటో ప్రయాణికులతో శుక్రవారం మధ్యాహ్నం బస్టాండ్ నుంచి అంబేద్కర్ సెంటర్‌కు వెళుతున్నాడు. ఈ క్రమంలో ఖానాపురం మండలం నాజీతండాకు చెందిన మోహన్‌నాయక్ తన భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆటోకు ఢీకొట్టాడు. దీంతో కిందపడిపోయిన మోహన్‌నాయక్ ఆగ్రహావేశాలతో మాలధారణలో ఉన్న ఆటోడ్రైవర్ రేవంత్‌పై చేయి చేసుకొని దుర్భాషలాడాడు. దీంతో ద్విచక్రవాహనదారుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇదే రోజు సాయంత్రం నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి రేవంత్‌కు మద్దతు హనుమాన్ మాలధారులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. దీంతో కొద్దిసేపు పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ విషయంపై టౌన్ సీఐ రఘుపతిరెడ్డిని అడుగగా రేవంత్ ఫిర్యాదు చేశాడని, ద్విచక్రవాహనదారుడిని పిలిపించి విచారణ చేస్తామని తెలిపారు.



పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న హనుమాన్ భక్తులు

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

● వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ● జనగామ ఏసీపీ, చిలుపూర్ పీఎస్‌ల పరిశీలన

జనగామ రూరల్/చిలుపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వారికి న్యాయం చేయాలని వరంగల్ సీపీ సన్ ప్రీత్‌సింగ్ ఆదేశించారు. జనగామలోని ఏసీపీ కార్యాలయంలోని వెస్ట్ జోన్ పోలీసు అధికారుల సమావేశ ప్రాంగణాన్ని శుక్రవారం సీపీ ప్రారంభించారు. అనంతరం సీపీ ఏసీపీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరూ సమయానికి అనుగుణంగా విధులను నిర్వర్తిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ చేతన్ నితిన్, ఏసీపీలు భీం శర్మ నర్సయ్య, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

● చిలుపూర్ పోలీస్‌స్టేషన్‌ను సీపీ సన్‌ప్రీత్‌సింగ్ శుక్రవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి సిబ్బంది వివరాలతో పాటు, వారికి కేటాయించిన విధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గంజాయి, పేకాట, బెట్టింగ్స్, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. సైబర్‌క్రైమ్స్‌పై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. భూవివాదాలు, కుటుంబ గొడవలపై అప్రమత్తంగా వ్యవహరించాలని, పోలీసులపై ఫిర్యాదుదారులకు నమ్మకం కలిగించేలా వ్యవహరించాలని సూచించారు. రౌడీషీటర్లు, అనుమానితులపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు.

ఈ కార్యక్రమంలో జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ (రఘునాథపల్లి) సీఐ ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, ఏఎస్సై జయకుమార్, సిబ్బంది శ్రీనివాస్, వీరన్న, ఇంద్రాచారి, రమాదేవి, కిరణ్, సునిల్, కుమారస్వామి, నాజర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



చిలుపూరు పోలీస్‌స్టేషన్ ఎదుట మొక్కలు నాటుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

కేయూ అనుబంధ కళాశాలలు న్యాక్‌కు సిద్ధం కావాలి

● కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ● కేయూతో ఓయూ, శాతవాహన వర్సిటీల ఎంఓయూ



సమావేశంలో పాల్గొన్న వీసీ ప్రతాప్‌రెడ్డి, ఇతర ప్రొఫెసర్లు, అధికారులు

కేయూ క్యాంపస్ మే 16, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలు నూతన న్యాక్ గ్రేడింగ్‌కు సిద్ధం కావాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కేయూ పరిపాలన భవనం కమిటీ హాల్‌లో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ (ఐక్యూఏసీ) డైరెక్టర్ షమిత అధ్యక్షతన సమావేశం జరిగింది. సెంటర్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ స్కీమ్ అండ్ పాలసీస్ (సీఆర్ఐఎస్పీ) అనే స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సెంటర్‌ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ క్వాలిటీ అప్‌గ్రేడేషన్ అండ్ ఎక్స్‌లెన్స్‌లో భాగంగా హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీ, కరీంనగర్‌లోని శాతవాహన వర్సిటీలతో కేయూ ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులతో కేయూ ఐక్యూఏసీ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. వర్సిటీల పరిధిలోని అనుబంధ కళాశాలల్లో ఉన్నత విద్యలో నాణ్యత పెంపుదలలో వర్సిటీలు ప్రధాన భూమిక వహిస్తాయని పేర్కొన్నారు. మారుతున్న నూతన గ్రేడింగ్ ప్రమాణాలకు అనుగుణంగా డేటాబేస్‌తో సిద్ధంగా ఉండాలని కళాశాలల బాధ్యులకు సూచించారు.

రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. న్యాక్ అక్రిడేషన్‌లో నూతనంగా వస్తున్న మార్పులపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంఓయూలో భాగంగా నూతన పరిచయ కార్యక్రమంలో కొత్త విషయాలు తెలుసుకోవాలని కోరారు. ఐక్యూఏసీ డైరెక్టర్ షమిత మాట్లాడుతూ.. వర్సిటీల అనుబంధ డిగ్రీ కళాశాలలో విద్యార్థులలో నైపుణ్యాల పెంపు, ఉద్యోగ సమర్థతను పెంచడం, కళాశాలల్లో క్వాలిటీని పెంపొందించడంతోపాటు న్యాక్‌కు సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీడీసీ డీన్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, అకడమిక్ మెంటర్ డాక్టర్ ఏవీ రావు, డాక్టర్ అచ్యుత దేవి, సీఆర్ఐఎస్పీ స్టేట్ లీడ్ డాక్టర్ కె.రమ, ప్రొఫెసర్ లక్ష్మిపతిరావు పాల్గొన్నారు.

శివునిపల్లిలో గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న ప్రభుత్వ నిషేధిత గుట్కాలను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్సు ఏసీపీ మధుసుధన్ తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివునిపల్లి గ్రామంలో కిరాణ వ్యాపారి దేవ రవి నుంచి సుమారు రూ.16వేల విలువ చేసే గుట్కాలను సీఐ బాబులాల్ బృందం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.



కూచిపూడిలో ఆరాధ్యరెడ్డికి కేంద్ర ప్రభుత్వ ప్రతిభా అవార్డు

హనుమకొండ కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఎక్సైజ్‌కాలనీలో నివాసం ఉంటున్న జక్కు మహబూబారెడ్డి, ప్రతిభారెడ్డిల కుమార్తె ఆరాధ్యరెడ్డి కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహక ప్రతిభా అవార్డుకు ఎంపికైంది. కూచిపూడి నృత్యంలో అత్యంత ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తూ రాణిస్తున్న ఆరాధ్య రెడ్డి కేంద్రప్రభుత్వం అందించే కల్చరల్ టాలెంట్ సెర్చ్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ప్రముఖ నాట్యాచారుడు బొంపెల్లి సుధీర్‌రావు వద్ద కూచిపూడి నృత్యంలో ఓనమాలు నేర్చుకొని తన ప్రతిభతో అనేక వేదికలపై బహుమతులను సాధించి అవార్డులను అందుకుంది. భీమారం సమీపంలోని కిడ్స్ స్ట్రోక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 6వ తరగతి విద్యనభ్యసిస్తున్న ఆరాధ్య రెడ్డి తెలంగాణ నుంచి ఎంపికైన వారిలో ప్రథమ స్థానంలో ఉండటం విశేషం.

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి

మాజీ మంత్రి దయాకర్‌రావు వద్ద గన్‌మెన్‌గా చేస్తున్న సతీష్



స్టేషన్‌ఘన్‌పూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఛాగల్ పరిధిలోని శివారెడ్డిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ రాయరాకుల సతీష్ (42) గురువారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదెళ్లకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ సతీష్ కొంతకాలంగా మాజీ మంత్రి దయాకర్‌రావు గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి వ్యక్తిగత పనుల నిమిత్తం హనుమకొండ నుంచి జనగామకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో శివారెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారి పైన బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకొని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య రాధిక, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

‘టీజీ కాస్ట్’ నిధుల్లో.. గోల్‌మాల్!

(5వ పేజీ తరువాయి)

దాదాపుగా బిల్లులు చెల్లించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీటీఎస్ నిబంధనల ప్రకారం సర్వేలు పూర్తి చేశాకే పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించాల్సి ఉండగా, ముందస్తుగా బిల్లులు ఇవ్వటం వెనుక ఏం మతలబు జరిగిందనే చర్చ జరుగుతోంది. ఇందులో సైన్స్ సెంటర్‌లో పని చేస్తున్న ఓ ఉద్యోగి చక్రం తిప్పారని సమాచారం. ఈ క్రమంలోనే భారీ మొత్తంలో నిధులు తప్పుదారి పట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ట్రావెలింగ్ స్వాహా.. ప్రశ్నిస్తే ఉద్యోగం ఊస్ట్..

పరిశోధనలకు వెళ్లకుండానే వెళ్లినట్టు ట్రావెలింగ్ బిల్లులతో నిధులు కాజేస్తుండగా, పరిశోధనలకు పంపించమని అడిగిన ఉద్యోగులను తొలిగిస్తూ ఓ అధికారి శునకానందం పొందుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. డీటీఎస్ ద్వారా తీసుకున్న ఉద్యోగులు గిరిజన ప్రాంతాలు, ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలను సందర్శించి ఎస్సీ, ఎస్టీల జీవన విధానం, స్థితిగతులపై అధ్యయనం చేయాల్సి ఉంటుంది. అటవీ ఉత్పత్తులు, వాటి ప్రాసెసింగ్‌పై పరిశోధన చేయాలి. అయితే ప్రాజెక్టు ప్రారంభం నుంచి కేవలం శాస్త్రీయ తేనెటీగల పెంపకం, అవగాహన కార్యక్రమం మాత్రమే నిర్వహించారు. అయితే ప్రతీనెల ట్రావెలింగ్ చేసినట్టుగా నకిలీ బిల్లులు పెట్టి ఇప్పటి వరకు రూ.6లక్షలకు పైగా వరంగల్ సైన్స్ సెంటర్‌లోని ఓ అధికారి స్వాహా చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. పరిశోధనల కోసం తమను ఎస్సీ, ఎస్టీ జనాభా ఉన్న ప్రాంతాలకు పంపించాలని ఉద్యోగులు కోరినా పట్టించుకోకపోగా.. ఏదో ఒక వంకతో ఒత్తిడి తీసుకవస్తున్నారనే ఆరోపణలున్నాయి. పరిశోధనలు లేక.. సదరు అధికారి ఒత్తిడి తట్టుకోలేక ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులు రాజీనామా చేసి బయటకు వెళ్లిపోయారు. తాను చెప్పినట్టుగా వినటం లేదని మరో ముగ్గురిని సదరు అధికారి తొలిగించినట్టు సమాచారం. అయితే వీరికి సుమారు రూ.11లక్షలకు పైగా వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా వివిధ కారణాలు చెబుతూ ఇవ్వకుండా సదరు అధికారి వేధింపులకు గురి చేస్తున్నారని సైన్స్ సెంటర్ నుంచి బయటకు వచ్చిన ఉద్యోగులు వాపోతున్నారు. 8నెలలుగా వేతనాలు ఇవ్వకుండా మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులకు కూడా వేతనాలు ఇవ్వటం లేదని వాపోతున్నారు. వీటితో పాటు రూ.3.60లక్షలతో కొనుగోలు చేసిన కంప్యూటర్లు, రూ.5.28లక్షలతో కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లతో పాటు సుమారు రూ.20లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన అనేక వస్తువుల్లో చాలా వరకు ఇతర ప్రాజెక్టులకు తరలించటం, కొన్నింటిని స్వాహా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బిల్డింగ్ నిర్మాణంలో నిధులు మాయం

ఈ కార్యక్రమంలో భాగంగా వరంగల్ సైన్స్ సెంటర్‌లో ఎస్సీ, ఎస్టీ సెల్ కోసం బిల్డింగ్ నిర్మాణానికి డీటీఎస్ నిధులు కేటాయించింది. హంటర్‌రోడ్డులోని టైగర్ హిల్స్‌పై అప్పటికే సైన్స్ సెంటర్‌తో పాటు 2015లో అతిథిగృహం కోసం ఓభవనాన్ని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే నిధులు లేక అసంపూర్తిగా ఉండటంతో ఈ బిల్డింగ్‌ను 2022లో ఎస్సీ, ఎస్టీ సెల్‌కు కేటాయించారు. కుడా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఎస్సీ, ఎస్టీ భవనానికి రూ.1.10కోట్లు ఖర్చు చేశారు. అయితే టీడీఎస్ ఈ భవనానికి రూ.1.60కోట్లు కేటాయించినట్టు బిల్లులు పెట్టారు. మరో రూ.50లక్షల నిధులు ఎక్కువ డ్రా చేసుకోవటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాత బిల్డింగ్ అప్పగించటంతో అందుకు చేసిన ఖర్చు కింద రూ.50లక్షలు తీసుకున్నట్లు చెబుతున్నారు. అయితే ఎందుకు తీసుకున్నారు.. ఎవరు తీసుకున్నారు.. ఏ శాఖకు ఈ నిధులను జమ చేశారనే దానిపై ఎలాంటి స్పష్టత లేకపోవటంతో ఈ నిధులు పక్కదారి పట్టాయనే చర్చ జరుగుతోంది.


ఎస్సీ, ఎస్టీ సెల్‌కు తాళం.. ఉద్యోగులకు వేతనాల బంద్

ఎస్సీ, ఎస్టీ జీవన విధానంపై పరిశోధనలు చేసేందుకు 2022లో డీటీఎస్ ఈపథకాన్ని ప్రారంభించింది. మూడేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తే.. మూడు విడతల్లో నిధులు కేటాయిస్తుంది. అయితే దాదాపు మూడేళ్లవుతున్నా ఈ ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయారు. నిధులన్నీ కూడా దారిమళ్లించినట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. రూ.8.08కోట్ల నిధులు రావాల్సి ఉండగా, పనులు పూర్తి కాకపోవడంతో 65శాతం వరకే నిధులు వచ్చాయి. ఇక డీటీఎస్ ఈ పథకాన్ని మరో ఏడాది పొడిగించే అవకాశం ఉందని సమాచారం. అయితే సైన్స్ సెంటర్‌లో చక్రం తిప్పుతున్న సదరు అధికారి ప్రాజెక్టు పూర్తయిందని ఎస్సీ ఎస్టీ సెల్ భవనానికి బుధవారం తాళం వేశారు. సదరు అధికారి వేధింపులు, ఒత్తిళ్లకు తట్టుకోలేక, కొందరిని తొలగించగా మిగిలింది ఇద్దరే ఉద్యోగులు. ఎవరికి వేతనాలు ఇవ్వకుండా, ముందస్తు సమాచారం లేకుండా తొలగించటంపై విమర్శలు వస్తున్నాయి. వరంగల్‌కు చెందిన ఈ ఉద్యోగులందరిని తొలగించి మహబూబ్‌నగర్, హైదరాబాద్‌కు చెందిన వారిని తీసుకోవాలనే ప్రణాళికలో భాగంగానే సదరు అధికారి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఓ మంత్రి మెప్పు కోసం ఈ ప్రాజెక్టులో పనిచేస్తున్నవారిపై వేటు వేస్తున్నారనే చర్చ జరుగుతుంది.

కలెక్టర్ విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగులోకి..

వరంగల్ సైన్స్ సెంటర్ కేంద్రంగా అమలవుతున్న ఈ కార్యక్రమంలో భారీగా అక్రమాలు జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. వరంగల్ రీజినల్ సైన్స్ సెంటర్ చైర్మన్‌గా ఉన్న హనుమకొండ కలెక్టర్ ఇంత జరుగుతున్నా పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీఎస్ నిధులతో టీజీ కాస్ట్ అమలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ స్థితిగతుల సర్వేకు కేటాయించిన నిధుల చెల్లింపులు, ప్రాజెక్టు రిపోర్టులు, ఇప్పటి వరకు జరిగిన పనులు, ఇచ్చిన బిల్లులు, తిరిగి చేసిన పరిశోధనలు, ఉద్యోగుల వేతనాలు, తొలగింపు తదితర వాటిపై ప్రత్యేక బృందాన్ని నియమించి విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే చర్చ జరుగుతోంది. అంతేకాకుండా రూ.కోట్ల ప్రజాధనం అక్రమార్కుల పరం కాకుండా కాపాడటం, ఎస్సీ, ఎస్టీ స్థితిగతులపై వాస్తవాలతో కూడిన పరిశోధనలు జరిగితే వారి జీవితాల్లో వెలుగులు నిండే అవకాశం ఉంది. కలెక్టర్ ప్రత్యేక చొరవతో విచారణ చేపట్టి వాస్తవాలు బయటకు తీసి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఓరుగల్లువాసులు కోరుతున్నారు.

అండర్-25 అంతర్ జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు




వరంగల్ జిల్లా జట్టుతో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్, మే 16(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండురోజులుగా వంగపల్లి క్రికెట్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న అండర్-25 బాలుర అంతర్ జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికలు శుక్రవారం ముగిశాయి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రికెటర్లను గుర్తించి, వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి జూన్ నెల మొదటి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-25 బాలుర టూ-డే క్రికెట్ లీగ్ పోటీల్లో పాల్గొననున్న అంతర్ జిల్లా స్థాయి వరంగల్ జిల్లా జట్టుతో పాటు మరో 5జట్లును ఎంపిక చేసినట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో 250మంది క్రీడాకారులు పాల్గొనగా ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, ములుగు, మహబూబాబాద్, జనగామ జిల్లాల నుంచి 6జట్లుగా విభజించి అంతర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. అంతర్ జిల్లా స్థాయికి ఎంపికైన ఈ 6జట్ల మధ్య ఈ నెల 19నుంచి జూన్ 2వ తేదీ వరకు హనుమకొండ రెడ్డిపురం, వరంగల్ జిల్లాలోని మొగిలిచర్ల, జనగామ జిల్లా వంగపల్లిలోని క్రికెట్ క్రీడా మైదానాల్లో పోటీలను నిర్వహిస్తామన్నారు. దాదాపు 15రోజులపాటు మూడు క్రీడా మైదానాల్లో 6జట్ల మధ్య నిర్వహించిన అంతర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఒక జట్టును ఎంపిక చేస్తామన్నారు. వీరు జూన్ మొదటి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న హెచ్‌సీఏ అండర్-25 టూ-డే క్రికెట్ లీగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా పోటీల కమిటీ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, సెలక్షన్ కమిటీ మెంబర్లు అఫ్జల్, పవన్, జిల్లా సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, ఉపాధ్యక్షులు తోట రాము, మట్టెడ కుమార్, కోచ్ గోవింద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దక్షిణమధ్య రైల్వే జీఎం రాక

వరంగల్ రైల్వేస్టేషన్‌ను సందర్శించనున్న అరుణ్‌కుమార్ జైన్



గిర్మాజీపేట, మే16 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శనివారం ఉదయం వరంగల్‌కు వస్తున్నారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్ స్కీమ్‌లో భాగంగా రూ.25.41 కోట్లతో ఆధునీకరించిన వరంగల్ రైల్వేస్టేషన్‌ను ఆయన సందర్శిస్తారు. ఈనెల 22న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఆయన ఏర్పాట్లను పరిశీలిస్తారు. రైల్వే అధికారులతో సమావేశమై తగు సూచనలు ఇస్తారు. అనంతరం పెద్దపల్లికి వెళతారు. రైల్వేస్టేషన్‌ను తనిఖీచేసి అక్కడి నుంచి కరీంనగర్ వెళ్తారు. అక్కడ లంచ్ చేసిన అనంతరం తిరిగి పెద్దపల్లికి వచ్చి నుంచి సాయంత్రం 5 గంటలకు సికింద్రాబాద్‌కు వెళతారు. జీఎం పర్యటన నేపథ్యంలో వరంగల్ రైల్వేస్టేషన్‌లో వివిధ విభాగాల అధికారులు అలర్ట్ అయ్యారు. రైల్వేస్టేషన్‌లో మిగిలి పోయిన పనులను పూర్తిచేయడంలో నిమగ్నమయ్యారు.

సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ రాక..

దక్షిణమధ్య రైల్వే సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ (ఆర్.పీ.ఎఫ్) దేబస్మిత చటోపాధ్యాయ బెనర్జీ శనివారం ఉదయం 9 గంటలకు వరంగల్ ఆర్‌పీఎఫ్ ఠానాను సందర్శిస్తారు. అధికారుల పనితీరును ఆమె సమీక్షిస్తారు. ఆర్‌పీఎఫ్ ఠానా నూతన భవనం నిర్మాణం, ప్రస్తుత ఠానా తాత్కలిక తరలింపుపై రైల్వే ఆర్‌పీఎఫ్ అధికారులతో చర్చిస్తారు.

ఎంజీఎంలో పాము కలకలం

వరంగల్ మెడికల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి ఓపీ బ్లాక్ వద్ద పాము కనిపించడంతో రోగులు ఆందోళన చెందారు. శుక్రవారం ఉదయం ఆర్థో, జనరల్ మెడిసిన్ లాంటి విభాగాల్లో వైద్య సేవలు పొందేందుకు రోగులు కూర్చున్నారు. ఇదే సమయంలో ఆ పక్కనే ఉన్న ఫిజియోథెరపీ బ్లాక్ నుంచి పాము రావడం కనిపించింది. రోగులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. ఓపీ బ్లాక్ ఆవరణలో శానిటేషన్ ఇష్టారాజ్యంగా మారిందని, కనీసం నెలకు ఒకసారి కూడా శుభ్రం చేయడం లేదని రోగులు వాపోతున్నారు. అనారోగ్యంతో ఎంజీఎంకు వస్తే విష సర్పాల వల్ల మొత్తం ప్రాణం మీదికి వచ్చేటట్టు ఉందని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సరస్వతీ.. నమో నమామి

- 'అంతర్వాహిని'కి చెంతకు తరలొస్తున్న భక్తులు
- తొలిరోజుతో పోలిస్తే రెండో రోజు రెట్టింపైన సంఖ్య
- సుమారు 50 మంది వచ్చినట్టు అంచనా
- సదుపాయాల కల్పనలో అధికారులు విఫలం
- సమాచార, సమన్వయ లోపంతో జనం అవస్థలు



ప్రధాన పుష్కరఘాట్‌లోని సరస్వతీ మాత విగ్రహం వద్ద భక్తుల సందడి

పుష్కర శోభితమైన కాళేశ్వరం



కాళేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి): పుష్కరస్నానం.. సకలపాప హరణం... అని భావించే భక్త జన కోటి సరస్వతీ నమోనమామి అంటూ తరలొస్తోంది. పుష్కరాల్లో రెండో రోజున అంతర్వాహిని రూపంలో ఉన్న ఆ సరస్వతీనదీమ తల్లికి నీరాజనం పలికింది. ప్రారంభ రోజైన గురువారం భక్తుల సంఖ్య పలుచగా కనిపించినా.. రెండో రోజైన శుక్రవారం ఉదయం నుంచే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సరస్వతీ ఘాట్, ప్రధానఘాట్ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. శుక్రవారం సాయంత్రం వరకు కాళేశ్వరంలోని ముక్తీశ్వరుడిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 50వేలు దాటిందని అధికారులు అంచనా వేశారు. అయితే పుష్కరాల నిర్వహణలో అధికారుల విఫమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తులు అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నా.. వాటిని అధిగమిస్తూ పుష్కరస్నానాలు ఆచరిస్తున్నారు. 50వేలకు పైగా భక్తులు తరలిరావడంతో కాళేశ్వరం రోడ్లు రద్దీగా మారాయి. రహదారులు, కూడళ్లలో ట్రాఫిక్, పోలీసులు ఉన్నా ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. భక్తులు ఎటు వైపు వెళ్లాలి.. ఎలా వెళ్లాలి? లాంటి సూచనలు చేసేవారు లేకపోవడం, కనీసం చౌరస్తాల వద్ద సూచన బోర్డులు కూడా పెట్టకపోవడంతో సమస్య జటిలమవుతోంది. 300ఆర్టీసీ బస్సులు, సుమారు 2800 కార్లు, ఆటోలు, వివిధ ప్రైవేటు వాహనాలు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు.

స్వామి దర్శనానికి భక్తుల క్యూ..

సరస్వతీ పుష్కరాల సందర్భంగా వేలాదిగా కాళేశ్వరానికి తరలివచ్చిన భక్తులు ముక్తీశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో బారులు తీరారు. సరస్వతీ నదిలో స్నానమాచరించిన అనంతరం నేరుగా ఆలయానికి వచ్చి శివ, యమ లింగాలను దర్శించుకుంటున్నారు. అయితే వీఐపీలు వచ్చిన సందర్భంగా భక్తులను గంటసేపు నిలిపివేయడంతో తీవ్ర అసంతృప్తికి గురైన భక్తులు ఆలయ అధికారుల పనితీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈవో డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అలాగే పోలీసులు సైతం అత్యుత్సాహం చూపి భక్తులను సరైన పద్ధతిలో పంపించడం లేదని విమర్శలు చేశారు.


ముక్తీశ్వరాలయంలో భక్తుల క్యూ


పుష్కరస్నానమాచరిస్తున్న దంపతులు



రెండోరోజూ వైభవంగా నవరత్న హారతి

సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని కాళేశ్వర త్రివేణి సంగమంలో 12రోజుల పాటు నిర్వహించనున్న నవరత్న హారతి కార్యక్రమం రెండోరోజైన శుక్రవారం కూడా అత్యంత వైభవంగా జరిగింది. ఏడుగురు కాశీపండితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వేలాది భక్తులు తిలకించారు.


త్రివేణి సంగమ తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు





పుష్కర వేళ.. సరస్వతీ ఆలయం వెలవెల

- దర్శన సూచికలు ఏర్పాట్లు చేయని అధికారులు
- నిర్లక్ష్యం పట్ల వెల్లువెత్తుతున్న విమర్శలు


నిర్మానుష్యంగా ఉన్న సరస్వతీ మాత ఆలయం

కాళేశ్వరం, మే 16(ఆంధ్రజ్యోతి) : ఓ వైపు సరస్వతి నది పుష్కరాలు అంగరంగ వైభవంగా జరుగుతున్న వేళ.. కాళేశ్వర ముక్తీశ్వరాలయాన్ని ఆనుకుని ఉన్న సరస్వతీ మాత ఆలయం వెలవెల బోతోంది. ముక్తీశ్వరాలయానికి ఓ పక్క శుభానంద దేవి ఆలయం ఉండగా మరో పక్క సరస్వతీ మాతఆలయం ఉంది. అయితే స్వామి వారి దర్శనార్థం వచ్చిన పుష్కర భక్తులు కేవలం శుభానందదేవి అమ్మవారిని దర్శించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రధాన ఆలయానికి కుడివైపున ఉన్న సరస్వతీ ఆలయానికి భక్తులు వెళ్లేలా ఎలాంటి సూచికలు లేకపోవడంతో అమ్మవారి ఆలయం వెలవెలబోతోంది. పుష్కర భక్తులు సరస్వతీ అమ్మవారిని దర్శించుకునేలా దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాటు చేయలేదనే విమర్శలు వస్తున్నాయి. ఇక సరస్వతీ పుష్కర ఘాట్‌కు వచ్చే భక్తులు ఘాట్ నుంచి ఆలయానికి రాకుండానే వెనుదిరుగుతున్నారు. పుష్కరఘాట్ నుంచి ఆలయానికి వాహనాలను అనుమతించకపోవడంతో దర్శనాలకు భక్తులు ఆసక్తి చూపడం లేదు. తీవ్రమైన ఎండ, ఆలయానికి - పుష్కరఘాట్‌కు మధ్య దూరం ఉండడంతో భక్తులు రావడం లేదు. పుష్కరఘాట్ నుంచి ఆలయానికి వెళ్ళేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని పుష్కర భక్తులు కోరుతున్నారు.

ఎడ్లబండ్లకు భలే గిరాకీ..!



కాళేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాల్లో బస్సులు, కార్లు, జీపులు తదితర వాహనాలతో పాటు సంప్రదాయ ఎడ్లబండ్లు కూడా హల్‌చల్ చేస్తున్నాయి. వాహనాల్లో వచ్చే పలువురు భక్తులు ప్రధాన పుష్కరఘాట్ వద్దకు చేరుకుని పుణ్యస్నానం చేయడానికి, తిరిగి పార్కింగ్ స్థలాలకు వెళ్లడానికి ఎడ్లబండ్లను ఆశ్రయిస్తున్నారు. ఇసుకలో నడవడానికి ఇబ్బందిపడుతున్న భక్తుల కోసం కొందరు స్థానికులు , రైతులు ఈ ఎడ్లబండ్లను ఏర్పాటు చేశారు. ఆ బండ్లలో వెళుతున్న వారు ఎడ్లబండ్ల యజమానులకు ఎంతో కొంత ముట్టజెప్తున్నారు.

పుష్కర స్నానమాచరించిన డిప్యూటీ సీఎం దంపతులు



కాళేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీసమేతంగా పుష్కరస్నానమాచరించారు. శుక్రవారం సాయంత్రం తన సతీమణి నందినితో కలిసి కాళేశ్వరం చేరుకోగా.. వారికి మంత్రి శ్రీధర్‌బాబు వారికి ఘన స్వాగతం పలికారు. తొలుత సరస్వతీ మాతను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పుణ్య స్నానం ఆచరించి సరస్వతీమాతకు చీరసారె సమర్పించారు. ఆ తర్వాత సరస్వతీఘాట్‌లో జరిగిన నవరత్న మహాహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సరస్వతీ పుష్కరాల్లో పాల్గొనడం తన అదృష్టమని, మొదటిసారిగా కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలతో పాటు టెంట్ సిటీ ఏర్పాటు చేసి వేల మంది విడిది చేసేలా ఎర్పాట్లు చేశామన్నారు. పుష్కర కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆయన అభినందించారు. అనంతరం టెంట్‌సిటీకి వెళ్లిన భట్టి శుక్రవారం రాత్రి అక్కడే బసచేశారు. శనివారం ఉదయం తమ పితృదేవతలకు పిండప్రదాన కార్యక్రమాలు నిర్వహించుకుని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని.. హైదరబాద్ తిరుగుపయనమవనున్నారు.


స్టాల్‌ను ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా

జైళ్ల శాఖ ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు

ప్రారంభించిన డీజీపీ సౌమ్య మిశ్రా

కాళేశ్వరం, మే 16(ఆంధ్రజ్యోతి) : ప్రధానఘాట్ వద్ద జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను డీజీపీ సౌమ్యమిశ్రా శుక్రవారం ప్రారంభించారు. సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో ప్రధాన ఘాట్ వద్ద పలుశాఖ ఆధ్వర్యంలో స్టాళ్ల ఏర్పాటు చేయగా అందులో భాగంగా జైళ్ల శాఖ ఆధ్వర్యంలో తయారు చేసిన చేనేత వస్తువులు, ఇతర వస్తువులతో కూడిన స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఆస్టాల్‌ను సౌమ్యమిశ్రా.. భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలతో కలిసి ప్రారంభించారు.


ద్వాదశ జ్యోతిర్లింగాల వద్ద మొక్కుకుంటున్న భక్తులు

కాళేశ్వర క్షేత్రంలో జ్యోతిర్లింగాలు!

కాళేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి): త్రిలింగ క్షేత్రమైన కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పుష్కర స్నానాలు, కాళేశ్వర-ముక్తీశ్వరస్వామి దర్శనానికొచ్చే భక్తుల కోసం బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ప్రధాన పుష్కర ఘాట్‌కు వెళ్లే దారిలో ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. శివుడు, శ్రీకృష్ణుడు విగ్రహాలను కూడా ఉంచగా భక్తులు పూజలు చేసి మొక్కుకుంటున్నారు. భక్తులకు బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు భక్తిమార్గం గురించి వివరిస్తున్నారు.

ఇదే తొలి పుష్కరం..



ఇదే నా తొలి పుష్కరం.. ఘాట్ వద్ద ఏర్పాట్లు బాగున్నాయి. తొలిసారి సరస్వతిలో పుష్కరస్నానం చేయడం ఆనందంగా ఉంది. ఈ సంగమం ఎంతో పవిత్రమైంది. మళ్లీ గోదావరి పుష్కరాలకు ఇక్కడకు వస్తా.

\- సౌమ్య, వరంగల్

పుణ్యస్నానం ఆనందంగా ఉంది..



ఇప్పటికి రెండు పుష్కరాలకు కాళేశ్వరం వచ్చా. సరస్వతీ పుష్కరాలకు రావడం మాత్రం ఇదే తొలిసారి. దక్షిణ కాశీగా పిలుచుకునే కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం చేయడం ఆనందంగా ఉంది. కాకపోతే ఏర్పాట్లు పూర్తిగా చేయలేదు.. పూర్తి చేసి ఉంటే ఇంకా బాగుండేది.

\- భవాని, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏపీ

సంగమం వద్ద పుష్కరస్నానం అదృష్టం



సరస్వతీ నది పుష్కరాలకు రావడం ఇదే తొలిసారి. పవిత్రమైన త్రివేణి సంగమం వద్ద అంతర్వాహినిగా ఉన్న సరస్వతిలో పుష్కర స్నానం ఆచరించడం అదృష్టంగా భావిస్తున్నా. పుష్కరఘాట్ వద్ద ఏర్పాట్లు బాగున్నాయి.

\- మౌనిక, మంచిర్యాల

ఎండ తీవ్రతకు భక్తుల ఇబ్బందులు

కాళేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి) : భానుడి ప్రతాపానికి పుష్కర భక్తులు అల్లాడుతున్నారు శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాతావరణం కాస్త చల్లగా ఉండగా మధ్యాహ్నానికి ఒక్కసారిగా భానుడు ప్రతాపం చూపడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఎండ నుంచి రక్షించుకోవడానికి గొడుగులు, వస్త్రాలు కప్పుకొన్నారు. పండ్ల రసాలు, ఐస్‌క్రీం, సోడాల దుకాణాల వద్ద గుమిగుడారు. అలాగే పుష్కర ఘాట్ సమీపంలో ఉన్న చలువపందిళ్ల, చెట్ల కింద భక్తులు సేద తీరుతూ కన్పించారు. పార్కింగ్ ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ఇక పుష్కర ఘాట్ వద్ద చెప్పులు లేకుంటే మెట్ల పై నుంచి నడవలేని పరిస్థితి ఉంది. కొందరు మహిళలు నెత్తిన స్టూళ్ల పెట్టుకుని కనిపించగా.. ఓ భక్తుడు చెప్పులు అందుబాటులో లేకపోవడంతో కాళ్లకు కవర్లు కట్టుకొని మెట్లు ఎక్కడం కనించింది.


గొడుగుల నీడన వస్తున్న భక్తులు


కాళ్లకు కవర్లు కట్టుకొని నడుస్తున్న భక్తుడు

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి


భక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్

కాళేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాల్లో భాగంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టర్ స్టాళ్ల, టెంట్ సిటీ, పుష్కరఘాట్, షవర్స్, చలివేంద్రాలను కాలినడకన వెళ్లి పరిశీలించారు. భక్తులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. కేటాయించిన ప్రాంతంలో మాత్రమే పిండ ప్రదానాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సరస్వతీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను పరిశీలించారు.

ప్రచార సాధనాలకు పందిరి కరువు!

- మీడియా సెంటర్ ఏర్పాటు చేయని అధికారులు
- అధికారిక సమాచారం కరువు
- వాట్సాప్ గ్రూపు ద్వారానే తెలియజేస్తున్న యంత్రాంగం


కాళేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్క రాల వార్తలను ప్రజలకు చేరవేసే మీడియాకు నీడ కరువైంది. పుష్కరాల ఏర్పాట్ల కోసం రూ.కోట్లు వెచ్చించిన ప్రభుత్వం మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయకపోవడంతో విధినిర్వహణలో ఉన్న జర్నలిస్టులు వసతి, భోజనం, తాగునీటి సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 12రోజుల పాటు ఈ వేడుకల జరుగుతున్న నేపథ్యంలో కనీసం టెంట్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎండ, ఉక్కపోతకు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం డ్యూటీ పాస్‌లు ఇచ్చి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో పుష్కరాలకు సంబంధించిన అధికారిక సమాచారం ఇచ్చే వారు కూడా లేరు. మీడియా సెంటర్ ఏర్పాటు చేసి అధికారికంగా సమాచారం ఇవ్వాల్సిన జిల్లా సమాచార శాఖ అధికారులు కేవలం వాట్సాప్ గ్రూప్ ద్వారా మాత్రమే సమాచారం అందిస్తున్నారు. అదికూడ వీవీఐపీలు వచ్చిన విషయాలను మాత్రమే అందులో పోస్టు చేస్తున్నారు. ఈ క్రమంలో మీడియా పట్ల అధికారులు వ్యవహరి స్తున్న తీరుపై జర్నలిస్టులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన ప్రాణహిత, గోదావరి పుష్కరాలతో పాటు మేడారం మహాజాతరలోనూ మీడియాకు పాయింట్ ఏర్పాటు చేసిన అధికారులు సరస్వతీ పుష్కరాల్లో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం తీవ్రవిమర్శలకు తావిస్తోంది.


స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సమన్వయంతో పనిచేసి పుష్కరాలను విజయవంతం చేయాలి

రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాళేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి): పుష్కర భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పుష్కరాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి పుష్కరఘాట్‌ల వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను, భక్తుల కోసం చేపట్టిన సౌకర్యాలను భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఆయన కొందరు భక్తులతో మాట్లాడారు. అనంతరం అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, స్వచ్ఛత ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేయాలని సూచించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాగూర్, పరిశ్రమల శాఖ జీఎం సిద్ధార్థ్, డీఆర్‌డీవో నరేష్, తదితరులున్నారు.


పరిపూర్ణనంద సరస్వతీ స్వామివారికి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

పుష్కర స్నానమాచరించిన పరిపూర్ణానంద స్వామి

ఆలయంలో రెండో రోజు సంకష్ట హర గణపతి హోమం

కాళేశ్వరం, మే 16(ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాల్లో రెండోరోజైన శుక్రవారం పరిపూర్ణానంద సరస్వతీ స్వామి పుష్కర స్నానమాచరించారు. తొలుత సరస్వతీ ఘాట్‌కు చేరుకున్న ఆయనకు దేవాదాయ శాఖ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం త్రివేణి సంగమంలో ప్రత్యేక పూజలు, పుణ్యస్నానమాచరించిన అనంతరం ముక్తీశ్వరాలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకస్వాములు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మహారుద్రాభిషేకం నిర్వహించారు. శుభానంద దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పరిపూర్ణనంద స్వామివారికి వినాయక స్వామి విగ్రహాన్ని బహూకరించారు. ఇక పుష్కరాల నేపథ్యంలో రెండో రోజు శ్రీకాళేశ్వర ముక్తీశ్వరాలయంలో సంకష్ట హర గణపతి హోమాన్ని వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కష్టాలు, ఇబ్బందులు తొలగిపోయి అంత శుభం కలగాలనే ఉద్దేశంతో ఈ హోమాన్ని రెండో రోజు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రూ.3 లక్షల నగదు అపహరణ

వరంగల్‌సిటీ, మే16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 14వ డివిజన్ లక్ష్మి గణపతి కాలనీలో నివాసముంటున్న తుప్పరి కర్ణాకర్ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బీరువాలో పెట్టిన మూడు లక్షల రూపాయల నగదును అపహరించుకుపోయారు. కూరగాయల వ్యాపారం చేసుకునే కర్ణాకర్ గురువారం సాయంత్రం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి తన చెల్లి ఇంటికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో బీరువా తెరిచి నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై కర్ణాకర్ వెంటనే ఏనుమాముల పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాఘవేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 19 మందికి జరిమానా

మట్టెవాడ మే 16, (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 19 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం శుక్రవారం రూ.20,800 జరిమానా విధించారు. అదే విధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఒకరికి రూ.500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

కె.నవీన్‌కుమార్, ఎస్సై, మట్టెవాడ



ముఖాముఖి

ఆంధ్రజ్యోతి: సైబర్ మోసాలపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఎస్సై: సెల్ ఫోన్‌లకు వచ్చే ఎలాంటి లింక్‌లు ఓపెన్ చేయవద్దు. ఎవరికీ ఓటీపీలు చెప్పొద్దు. పిల్లలకు ఫోన్‌లు ఇవ్వవద్దు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ షేర్ చేయవద్దు. అబద్ధపు ప్రకటనలు నమ్మవద్దు. రుణాల దరఖాస్తుల పేరిట లింక్‌లు పంపిస్తే ఓపెన్ చేయొద్దు. అపరిచితులతో ఆన్‌లైన్ లావాదేవీలు జరుపవద్దు.

ఆంధ్రజ్యోతి: ఫోన్ పోతే ఏం చేయాలి?

ఎస్సై: వెంటనే సిమ్ కార్డును బ్లాక్ చేయాలి. స్థానిక పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి.

ఆంధ్రజ్యోతి: బ్యాంకు లావాదేవీలకు సంబంధించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఎస్సై: బ్యాంకు ఖాతా నెంబరు, పాస్‌బుక్స్, చెక్ బుక్‌ల వివరాలు అపరిచితులకు ఇవ్వొద్దు. ఆధార్, పాన్, కార్డులు, పిన్ నెంబర్లు ఎవరికీ షేర్ చేయొద్దు.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరగాళ్లను ఎలా కనిపెట్టాలి?

ఎస్సై: ఫోన్ చేసి ఓటీపీలు అడిగినా, ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభం వస్తుందని చెప్పినా వారిని సైబర్ నేరగాళ్లుగా గుర్తించాలి.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోతే ఏం చేయాలి

ఎస్సై: వెంటనే 1930 నెంబర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలి. అలాగే వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయాలి.

-మట్టెవాడ (ఆంధ్రజ్యోతి)

కృపయా ధ్యాన్‌దే..!

- పునఃప్రారంభానికి సిద్ధమైన వరంగల్ రైల్వేస్టేషన్
- ఎయిర్‌పోర్ట్‌ను తలపించే వసతులు
- లిఫ్టులు.. ఎస్కలేటర్లు.. ర్యాంపులు.. విశాలమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జి
- 22న వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ



బ్యాటరీ స్వాప్ పాయింట్



పునఃప్రారంభానికి సిద్ధమైన వరంగల్ రైల్వేస్టేషన్

గిర్మాజిపేట, మే16 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్ట్ తరహాలో అత్యాధునిక వసతులతో వరంగల్ రైల్వే స్టేషన్ పునఃప్రారంభానికి సిద్ధమైంది. కాకతీయుల కళావైభవాన్ని ప్రతిబింబించే విధంగా నిర్మాణం పూర్తిచేసుకుంది. ఎలివేషన్, విశాలమైన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ర్యాంపులు, ల్యాండ్ స్కేపింగ్, వెయిటింగ్ హాల్స్ లాంటి అత్యాధునిక వసతులతో ప్రయాణికులకు సేవలు అందించేందుకు ముస్తాబైంది. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్‌ఎస్) కింద రూ.25 కోట్లతో స్టేషన్ భవనాన్ని అధునీకరించారు. ఈనెల 22న ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీన్ని ప్రారంభిస్తారు. ఈ మేరకు రైల్వే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రయాణికులను ఆకట్టుకునేలా టికెట్ కౌంటర్లు, ప్లాట్‌ఫారాల గోడలపై కాకతీయుల కళా చిత్రాలను పెయింటింగ్ వేశారు.

● ఆకట్టుకునే ఏర్పాట్లు..

రైల్వేస్టేషన్ ఆవరణలోకి ప్రవేశించగానే కాకతీయ కళాతోరణం, మోడల్ ఇంజన్, స్తంభాలపై ఏర్పాటుచేసిన ఏనుగుల విగ్రహాలు స్వాగతం పలుకుతాయి. స్టేషన్ ఆవరణను పచ్చదనంతో ల్యాండ్ స్కేపింగ్ చేశారు. కార్లు లోనికి వచ్చి వెళ్లేందుకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేశారు. టూ వీలర్ పార్కింగ్ కోసం ఆధునిక షెడ్డు నిర్మించారు. ఫోర్ వీలర్ పార్కింగ్‌కు క్రమబద్ధీకరించారు. ప్రయాణికులు బయటకు రాగానే ఆటో అందుబాటులో ఉండేలా పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. శివనగర్ వైపు ఆధునిక భవనం నిర్మించారు. రైల్వేస్టేషన్ నాలుగు ప్లాట్‌ఫారాలు, జనరల్, ఏసీ పెయిడ్ వెయిటింగ్ హాల్స్ లిఫ్టులు, ఎస్కలేటర్లు, ర్యాంపులు, రైల్వే పోలీస్‌స్టేషన్‌లు, టికెట్ కౌంటర్, రిజర్వేషన్ కౌంటర్, వీఐపీ లాంజ్, స్టేషన్ మేనేజర్ రూం, రిటైరింగ్ గదులు ఎక్కడ ఉన్నాయో తెలిపే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. కుడి వైపు టికెట్ కౌంటర్లు, ఎడమ వైపు రిజర్వేషన్ టికెట్ కౌంటర్లు ఉన్నాయి. నాలుగు ప్లాట్‌ఫారాలకు సులువుగా వెళ్లేలా 12 మీటర్ల వెడల్పుతో విశాలమైన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించారు దివ్యాంగులకు కూడా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు.

● కార్పొరేట్ తరహాలో వెయిటింగ్ హాల్స్

అధునాతన వసతులతో వెయిటింగ్ హాల్స్ నిర్మించారు. జనరల్ ప్రయాణికుల వెయిటింగ్ గదిని విశాలంగా ఏసీతో పాటుగా అధునాతన టాయిలెట్లు, స్నానాల గదులతో ఏర్పాటు చేశారు. పెయిడ్ ఏసీ వెయిటింగ్ హాల్‌లో లగ్జరీ సూట్ తరహాలో సీటింగ్, ఆహ్లాదపరిచే మొక్కలు, అధునాతన వాష్‌రూంలు, స్నానాల గదులు, టీవీ, న్యూస్ పేపర్, తినుబండారాల స్టాల్, వైఫై ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించారు. గంటకు రు.25లు చెల్లించి ఏసీ వెయిటింగ్ హాల్ సదుపాయం పొందవచ్చు. వీఐపీ కోసం ప్రత్యేకంగా గ్రాండ్ లుక్‌తో లాంజ్ ఏర్పాటు చేశారు.

● బ్యాటరీ స్వాప్ పాయింట్..

రైల్వేస్టేషన్ ఎంట్రెన్స్‌లో కుడి వైపు ఎలక్ట్రిక్ వాహనాల కోసం బ్యాట్రి స్వాప్ (మార్పిడి) పాయింట్‌ను ఏర్పాటు చేశారు. రాను రాను ఎలక్ట్రిక్ వాహనాలు పెరుగుతున్న నేపథ్యంలో వారి అవసరాలకు అనుగుణంగా ఈ స్వాప్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. బ్యాటరీ చార్జింగ్ అయిపోతే ఈ సెంటర్‌లో మార్చుకోవచ్చు. మొత్తంగా ప్రయాణికులకు సకల సౌకర్యాలు కల్పించారు.



ఎక్కి దిగేందుకు ఏర్పాటు చేసిన నూతన ఎస్కలేటర్



12 మీటర్ల వెడల్పు కలిగిన విశాలమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జి



నిర్మాణం పూర్తయిన భారీ ర్యాంపు

హమాలీ కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందిస్తున్న చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి

వరంగల్ వ్యవసాయం, మే 16(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత తట్టుకోలేక ఇటీవల ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మృతి చెందిన హమాలీ శివరాత్రి శ్రీనివాస్ కుటుంబానికి శుక్రవారం వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి రూ.11 వేల ఆర్థిక సాయం అందించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినందున వ్యవసాయ మార్కెట్ చట్టం ప్రకారం అతడికి ఎక్స్‌గ్రేషియా అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తక్షణమే చికిత్స అందించేందుకు కావాల్సిన వైద్య సదుపాయాలు కల్పించాలని మార్కెట్ అధికారులను కోరామన్నారు. కార్మికులందరూ తప్పనిసరిగా లేబర్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి అల్లె సంపత్, అడ్తి సెక్షన్ అధ్యక్షులు ఎస్‌రెడ్డి లింగారెడ్డి, ఉపాధ్యక్షులు సూర రమేష్, చిల్లీస్ సెక్షన్ కార్యదర్శి లోలకపూరి సురేందర్, గుమస్తాల సంఘం అధ్యక్షుడు ఇనుముల మల్లేశం, కార్యదర్శి సులుగం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె వాయిదా

ఖిలావరంగల్, మే 16(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా పడింది. ఈ నెల 20న నిర్వహించాలనుకున్న సమ్మెను జూలై 9కి వాయిదా వేసినట్లు ట్రేడ్ యూనియన్ నాయకులు తెలిపారు. శుక్రవారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు గన్నారపు రమేష్, ముక్కెర రామ స్వామి, గంగుల దయాకర్, పాశం రవి, ఆకులపెల్లి యాకోబ్, అకెనపల్లి యాదగిరి మాట్లాడుతూ.. కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు సమ్మెను వాయిదా వేశామన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవు లు, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఎం. సాగర్, ఎమ్డీ యాకూబ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల్లో స్ట్రీట్ లైట్లు.. చీకట్లో రోడ్లు



వరంగల్ ఓసిటీ రోడ్డులో చెట్ల కొమ్మల మధ్య వెలుగుతున్న వీధి దీపాలు

మట్టెవాడ మే 16, (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో వివిధ ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విధీ దీపాలను కమ్మేస్తున్నాయి. కాశిబుగ్గ సొసైటీ కాలనీ, తిలక్ రోడ్డు, ప్రతాపరుద్ర విధీ, చార్‌బౌళి రోడ్డు గిర్మాజీపేట ప్రధాన రోడ్డు, పాతక్ మహల్, మట్టెవాడ ప్రధాన రోడ్లపై ఈ సమస్య ఎక్కువగా ఉంది. దీంతో ఆయా రోడ్లు అంధకారంలో మగ్గుతున్నాయి. చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించడంలో కార్పొరేషన్ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి విధీ దీపాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి




ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం హనుమకొండలోని తన నివాసంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వెంటవెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు పదేపదే కార్యాలయాలకు రావడం వల్ల వారు ఇబ్బంది పడుతారని, ఆ పరిస్థితి రాకుండా చూడాలని కోరారు. ఎవరి పైరవీ అవసరం లేకుండా తనను నేరుగా కలసి సమస్యలను చెప్పుకోవచ్చన్నారు. తన పరిధిలో ఉన్నవాటిని అప్పటికప్పుడే పరిష్కరిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం, కొండా దంపతుల కోసం పనిచేసిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సైతం ఫిర్యాదులను స్వీకరించి సమస్యలకు పరిష్కారం చూపించారు.

● సమస్యలు వివరించిన వర్తక సంఘం నాయకులు..

వరంగల్ వ్యవసాయం: తమ సమస్యలను పరిష్కరించాలని వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ వర్తక సంఘం నాయకులు మంత్రి కొండా సురేఖను కోరారు. సంఘం గౌరవ అధ్యక్షుడు చింతాకుల అనిల్, అధ్యక్షుడు జారతి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మున్నాభాయి, కోశాధికారి బాబూరావు ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం శుక్రవారం మంత్రి కొండా సురేఖను ఆమె నివాసంలో కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీని ఆమెకు పరిచయం చేశారు. అనంతరం మంత్రికి మార్కెట్లోని సమస్యలను చెప్పుకున్నారు. మార్కెట్లో ఉన్న 158 మంది కాంప్లెక్స్ వర్తకులకు కిరాయి చార్జీలు తగ్గించాలని కోరారు. వర్తకులకు, హమాలీలకు మార్కెట్లో విశ్రాంతి భవనాన్ని నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హోల్‌సేల్ దుకాణాల ముందు రేకుల షెడ్లు నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మీసాల ప్రకాష్, జారతి రమేష్, మజీద్ అహ్మద్, బాబా, నాగేశ్వర్‌రావు, గోపి, వెంకన్న, రాజు, నాగరాజు, హరి, శ్రీనివాస్, రమేష్, చందు, రాజేందర్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.


గణపతికి చెరుకు రసంతో అభిషేకం



స్వామికి చెరుకు రసంతో అభిషేకం చేస్తున్న అర్చకులు

వరంగల్ కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంజీఎం సెంటర్‌లోగల శ్రీరాజరాజేశ్వరి దేవస్థానంలో 54వ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే ఈ వేడుకల్లో మొదటి రోజు చవితి సందర్భంగా శ్రీవిఘ్నేశ్వర స్వామికి 54 లీటర్ల చెరుకు రసంతో అభిషేకం నిర్వహించారు. ఉత్సవ పూజతోపాటు శ్రీమహాగణపతి హోమాన్ని నిర్వహించారు. అనంతరం మహా అలంకరణ, హారతి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వొద్దిరాజు వెంకటేశ్వర్‌రావు, ప్రధానార్చకులు లక్ష్మణాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి వేడుకలు



పూజలందుకుంటున్న వినాయకుడు

వరంగల్ కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): సంకటహర చతుర్థిని పురస్కరించుకొని దత్తక్షేత్రంలో గణపతి స్వామికి శుక్రవారం విశేషపూజలు చేశారు. ప్రతీ నెల సంకహర చతుర్థి రోజున దత్తక్షేత్రంలో స్వామివారికి విశేష అభిషేకం, అలంకరణ, అర్చన, వ్రత పూజతోపాటు శ్రీమహాగణపతి హోమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా స్వామివారికి ధూపదీప నైవేద్యాలతో మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులందరికి మహా అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అంతరాలు లేని సమాజమే సీపీఐ ధ్యేయం



ప్రసంగిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

ఖిలావరంగల్, మే 16(ఆంధ్రజ్యోతి): అంతరాలు లేని సమాజ నిర్మాణం కోసం సీపీఐ పని చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. శుక్రవారం సీపీఐ గణపతినగర్ రెండో మహాసభను శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు పేదల కోసం చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను వివరించారు. తెలంగాణలో నైజాం వెట్టిచాకిరీ, బానిసత్వానికి వ్యతి రేకంగా పోరాడి దొరలగడీల నుంచి 3000 గ్రామాలను విముక్తి చేసి పదిలక్షల ఎకరాలను పేదలకు పంచిందని, ఈ పోరాటంలో 4,500 మంది సీపీఐ నాయకులు, కార్యకర్తలు రక్త తర్పణం చేశారని గుర్తుచేశారు. వరంగల్ నగరానికి అండర్‌డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, గుడిసెవాసులకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు కట్టించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాషుమియా, పనాస ప్రసాద్, ఖిలావరంగల్ మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, సహాయకార్యదర్శులు ఓర్సు రాజు, తాళ్ళపల్లి జాన్‌పాల్, చిట్యాల సువర్ణ, ఎమ్డీ యాకూబ్, ఆడెపు లలిత, వంశీ, అన్నారం రమ, చిరంజీవి, సన్ను రాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



గుర్తు తెలియని మృతదేహం

గిర్మాజిపేట,మే16 (ఆంధ్రజ్యోతి): వరంగల్-కాజీపేట రైల్వే స్టేషన్‌ల మధ్య దర్గా సమీపంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు (35) ఆత్మహత్య చేసుకున్నాడు. తను 5 అడు గుల 2 అంగుళాల ఎత్తు, చామనచాయ శరీరం, గుండ్రని ముఖం, నల్లని తల వెంట్రుకలు, గడ్డం, మీసం కలిగి పెసర రంగు ప్యాంటు, ఎరుపు, నలుపు గీతల గులాబీ రంగు హాఫ్ షర్టు, బ్లూ రంగు డ్రాయర్, మెడలో నల్లని దారం ఉన్నాయని సీఐ పి.సురేందర్ తెలిపారు. తను రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడని, మృత దేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచి హెడ్‌కానిస్టేబుల్ ఎస్.రవిందర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు. మృతదేహం గుర్తింపు కోసం జీఆర్‌పీ 8712513862/ 8712658585 నెంబర్లలో సంప్రదించాలని సీఐ కోరారు.

కేడీసీ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ శ్రీనివాస్



వరంగల్ ఎడ్యుకేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కేడీసీ) ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ జి. శ్రీనివాస్‌ను నియమిస్తూ గురువారం కళాశాల విద్యా కమిషనర్ దేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కేడీసీ ప్రిన్సిపాల్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం శ్రీనివాస్ రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తూనే కేడీసీ ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కేడీసీ అధ్యాపక, అధ్యాపకేతర బృందంతో పాటు రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

తలాపున ట్యాంకు.. తాగడానికి నీళ్లు కరువు

సమస్యల వలయంలో 36వ డివిజన్

- పుప్పాల గుట్టలో నీటి ఎద్దడి
- ఆరెస్‌నగర్‌లో అస్తవ్యస్తంగా శ్మశానవాటిక
- చంద్రవదన కాలనీలో రక్షణ కంచెలేని డాంబర్ బావి
- జేబీ నగర్‌లో కంపుకొడుతున్న డ్రెయినేజీ



పుప్పాలగుట్టలో వృథాగా ఉన్న నీళ్ల ట్యాంక్

మిల్స్‌కాలనీ, మే 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ 36వ డివిజన్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. కాలనీలన్నీ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. అండర్ డ్రెయినేజీ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఆరెస్ నగర్‌లోని శ్మశానవాటిక సమస్యలతో అలమటిస్తోంది. చంద్రవదన కాలనీ ప్రధానరహదారిలోని డాంబర్ బావికి రక్షణ కంచే వేయడం లేదు. పుప్పాలగుట్టలో నీటి ఎద్దడి కొనసాగుతూనే ఉంది. జేబీనగర్‌లోని డ్రెయినేజీ వ్యవస్థ కంపుకొడుతోంది.

● అస్తవ్యస్తంగా శ్మశానవాటిక..

ఆరెస్‌నగర్‌లోని శ్మశాన వాటిక వసతులు లేక అస్తవ్యస్తంగా మారిపోయింది. నీటి వసతి బోర్ పనిచేయడక పోవడంతో అంతిమ సంస్కారాల అనంతరం స్నానాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మహిళల కోం ఏర్పాటు చేసిన స్నానాల గదులు శిథిలమయ్యాయి. ప్రహరీ ఎత్తుగా లేకపోవడంలో దహనసంస్కారాలు జరుగుతున్నప్పుడు పొగ మొత్తం ఇండ్లలోకి వెళుతోంది. బర్నింగ్ ప్లాట్‌ఫామ్స్ పై పొగ గొట్టాలు శిథిలమవడంతో పొగ మొత్తం పక్కన ఉన్న కాలనీలోకి చేరుతోంది. పిచ్చి మొక్కలు పెరిగి అంతిమ సంస్కారాలకు అడ్డంకిగా మారుతున్నాయి.

● ప్రమాదకరంగా బాంబర్ బావి ఊబి..

రానున్నది వర్షాకాలం కావడంతో చంద్రవదన కాలనీలో డాంబర్ బావి చుట్టు పక్కల ఉన్న ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఇక్కడ డాంబర్(తారు) తయారీ పరిశ్రమ ఉండటంతో పెద్ద బాయి లాంటి గోతి ఏర్పడింది. ఇప్పుడది పూడుకుపోయి ఊబిలా మారింది. దానిపై నుంచి వెళుతున్న పశువులు, తెలియని వారి వాహనాలు అందులో కూరుకుపోతున్నాయి. వర్షాకాలం ఈ పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉంటుందని, మున్సిపాలిటీ అధికారులు స్పందించి ఊబి గొయ్యి చుట్టూ రక్షణ కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

● పుప్పాలగుట్టలో తాగునీటికి తండ్లాటే...

పుప్పాలగుట్టలోని ఓ బావికి ఏర్పాటు చేసిన మోటార్లను చూస్తే తెలుస్తుంది. ఇక్కడ తాగు, అవసరాలకు ఉపయోగించే నీటికి ఎంత ఎద్దడి ఉందో. మిషన్ భగీరథ పైపులైన్లు ఏర్పాటు చేసినప్పటికీ నీరు సరఫరా అంతగా లేదు. పుప్పాలగుట్టలో ఏర్పాటు చేసిన 15 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న నీటి ట్యాంకు వృథాగా పడి ఉంది. నీరు ట్యాంకులోకి ఎక్కకపోవడంతోనే తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికీ ఈ కాలనీ వాసులు ప్రాచీన బావులకు మోటార్లు బిగించి, స్టేటిక్ ట్యాంకులపై ఆధారపడుతున్నారు. మున్సిపాలిటీ ట్యాంకర్లు సైతం సరిగ్గా రాకపోడంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

● జేబీనగర్‌లో కంపు కొడుతున్న డ్రెయినేజీ..

జేబీనగర్ ప్రాంతంలో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉంది. కాలువలు పూర్తిగా చెత్తా చెదారంతో నిండిపోయాయి. దీంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. రోడ్లకు ఇరువైపులా మురుగు కాలువలు చెత్తతో నిండి పోయాయి. దీంతో కల్వర్టుల వద్ద నీరు రోడ్డుపై పారుతోంది.



ఆరెస్‌నగర్ శ్మశానవాటికలో అధ్వానంగా ఉన్న మహిళల స్నానాల గదులు

ఆంధ్రజ్యోతి ★★
ANDHRAJYOTHY
5
గ్రేటర్ వరంగల్
శనివారం 17 మే 2025


త్రివేణి సంగమం వద్ద పుష్కరిణికి పూజలు చేస్తున్న భక్తులు

పుష్కర భక్తులతో సందడిగా కాళేశ్వర త్రివేణి సంగమం



సరస్వతీ.. నమో నమామి

- పుష్కర శోభితమైన కాళేశ్వరం
- 'అంతర్‌వాహిని' చెంతకు తరలొస్తున్న భక్తులు
- తొలి రోజుతో పోలిస్తే రెండో రోజు రెట్టింపైన సంఖ్య
- సుమారు 50వేల మంది వచ్చినట్టు అంచనా
- సతీసమేతంగా పుణ్యస్నానమాచరించిన డిప్యూటీ సీఎం
- సరస్వతీ మాతకు పూజలు.. నదీ హారతికి హాజరు

7

ఓ యువతి భక్తి తన్మయత్వం


పుష్కరమాతకు నవరత్న హారతి సమర్పిస్తున్న కాశీ పండితులు


త్రివేణి సంగమం వద్ద పుష్కరిణికి చీరసారె సమర్పించి పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నందిని దంపతులు

'టీజీ కాస్ట్' నిధుల్లో.. గోల్‌మాల్!

వరంగల్ సైన్స్ సెంటర్ ఎస్సీ, ఎస్టీ సెల్‌లో అక్రమాలు


సైన్స్ సెంటర్‌లో ప్రత్యేకంగా నిర్మించిన ఎస్సీ, ఎస్టీ సెల్ భవనం (ఫైల్)

తాళం వేసి ఉన్న ఎస్సీ, ఎస్టీ సెల్ కార్యాలయం



వరంగల్ సైన్స్ సెంటర్‌కు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (డీటీఎస్) కేటాయించిన నిధులు దారి తప్పుతున్నాయి. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల ఆర్థిక, సామాజిక, విద్య, ఆరోగ్య స్థితిగతులపై పరిశోధనల కోసం శాస్త్ర, సాంకేతిక మండలి (టీజీ కాస్ట్) ద్వారా వరంగల్ సైన్స్ సెంటర్‌కు డీటీఎస్ రూ.8.08కోట్లు కేటాయించింది. అయితే ఆ నిధులు దారి తప్పుతుండటంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. సర్వేలు, డిజైన్ల కోసం ఎంపిక చేసిన ఏజెన్సీలకు పూర్తి స్థాయిలో పనులు కాకండానే బిల్లులు చెల్లించటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటితో పాటు పరిశోధనలకు ఎటూ వెళ్లకుండానే రవాణా ఖర్చుల పేరుతో లక్షలాది రూపాయలు డ్రా చేయటం, పరిశోధనలు చేస్తామని అడిగిన ప్రాజెక్టు ఉద్యోగులను తొలగిస్తుండటం గమనార్హం. పైగా ప్రాజెక్టు పూర్తయిందని ఎస్సీ, ఎస్టీ సెల్ కార్యాలయానికి తాళం వేయటంపై ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సైన్స్ సెంటర్ పాత భవనాన్ని పూర్తి చేసేందుకు రూ.1.60కోట్లు కేటాయింపుల్లో అవకతవకలు జరిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇంత జరుగుతున్నా సైన్స్ సెంటర్ చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ దీనిపై దృష్టి సారించకపోవటం చర్చనీయాంశమైంది.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

ఎస్సీ, ఎస్టీల జీవన విధానం, ఆర్థిక స్థితిగతులు, విద్యా, ఆరోగ్యం తదితర వాటిపై పరిశోధనలు చేసేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నాలెజీ, సైన్స్(డీటీఎస్) తెలంగాణ శాస్త్ర, సాంకేతిక మండలి (టీజీ కాస్ట్)కి రూ.8,08,92,521 కేటాయించింది. టీజీ కాస్ట్ తెలంగాణలో ఉన్న ఏకైక సైన్స్ సెంటర్, వరంగల్ ద్వారా 2022లో ఈ పరిశోధనలు చేయించేందుకు నిధులను మళ్లించింది. ఈ పథకాన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని డీటీఎస్ నిబంధనలు పెట్టింది. ఈ ప్రాజెక్టు కిందనే వరంగల్ సైన్స్ సెంటర్‌లో ఎస్సీ ఎస్టీ సెల్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచే రాష్ట్ర వ్యాప్తంగా పరిశోధనలు చేపట్టారు. నెలకు రూ.60వేల వేతనంతో ప్రాజెక్టు కోఆర్డినేటర్, ఒక్కొక్కరికి రూ.42వేల వేతనంతో ఇద్దరు సీనియర్ ప్రాజెక్టు అసిస్టెంట్లు, ఒక్కొక్కరికి రూ.20వేల వేతనంతో ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక్కొక్కరికి రూ.15వేల వేతనంతో ఇద్దరు ఫీల్డ్ వర్కర్లు మొత్తం ఏడుగురు ఉద్యోగులను తీసుకునేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి మూడేళ్ల కాలంలో రూ.87,75,360 చెల్లించేలా డీటీఎస్ ఉత్తర్వ్యులిచ్చింది.

పరిశోధనలు పూర్తి కాకుండానే బిల్లులు

ఎస్సీ ఎస్టీలు మెరుగైన జీవితాన్ని గడపడానికి, విద్యా, ఆరోగ్యం, పరిశుభ్రత, వ్యవసాయ ఉత్పత్తి పెంచడానికి, మురుగునీటిని తొలగింపు తదితర కార్యక్రమాలు, చేతి పనులు వ్యాపారం, అటవీ ఉత్పత్తులపై శిక్షణ, ఎస్సీ, ఎస్టీ చేతివృత్తుల వారిలో నైపుణ్యాభివృద్ధి తదితర వాటిపై పరిశోధనలు చేసేందుకు ప్రత్యేకంగా ఏజెన్సీలను ఎంపిక చేశారు. వరంగల్ సైన్స్ సెంటర్ పర్యవేక్షణలో ఎస్టీల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) యూనివర్సిటీకి రూ.72,25,394, ఎస్సీల స్థితిగతులపై పరిశోధనలు చేసేందుకు టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ స్టడీస్ (టిస్)కు రూ.39,37,439 కేటాయించారు. అయితే ఇందులో ఎస్టీలపై అధ్యాయనం చేసి, ప్రాజెక్టు రిపోర్టును సెస్ ఏజెన్సీ టీజీ కాస్ట్‌కు నివేదికను అందించింది. అయితే ఇది డీటీఎస్ ఆశించిన స్థాయిలో లేకపోవటంతో రీ సర్వే చేసి కొత్త సర్వే రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. రీ సర్వే రిపోర్టును ఇప్పటి వరకు సెస్ ఇవ్వలేదు. టిస్ మొత్తానికి సర్వేనే పూర్తి చేయలేదని ఉద్యోగులు చెబుతున్నారు. అయితే ఈ రెండు ఏజెన్సీలకు పూర్తి స్థాయిలో

మిగతా 6వ పేజీలో...

- ఎస్సీ, ఎస్టీల స్థితిగతులపై సర్వే, ప్రణాళిక కోసం రూ.8.08కోట్లు కేటాయింపు
- పనులు పూర్తి కాకుండానే సర్వే ఏజెన్సీలకు పూర్తిస్థాయిలో బిల్లుల చెల్లింపు
- ఏడుగురు ఉద్యోగుల నియామకం.. రీసెర్చ్‌లకు వెళ్లనివ్వకుండా అడ్డంకులు
- ప్రశ్నించిన ఉద్యోగులపై తొలగింపు వేటు.. ఇక మిగిలింది ఇద్దరే
- ప్రాజెక్టు పూర్తయిందంటూ కార్యాలయానికి తాళం
- బిల్డింగ్‌కు రూ.1.60కోట్లు.. పాత భవనం పేరుతో రూ.50లక్షలు మాయం
- సైన్స్ సెంటర్‌లో చక్రం తిప్పుతున్న ఓ అధికారి
- రాష్ట్రంలోనే ఏకైక సైన్స్ సెంటర్ నిర్వహణపై దృష్టి పెట్టని కలెక్టర్

అనుబంధ కళాశాలలు న్యాక్‌కు సిద్ధం కావాలి

- కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- ఓయూ, శాతవాహన వర్సిటీల ఎంఓయూ

6

చివరి గింజ వరకు ధాన్యం కొంటాం

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, ఇతర అధికారులు

వరంగల్ కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్‌లతో కలిసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టామని, సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తున్నామని అన్నారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి కేంద్రాల వద్ద గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని మంత్రి సూచించారు. అనంతరం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో 182 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2024-25 రబీ సీజన్‌లో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అంచనా వేయగా ఇప్పటి వరకు 87వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయడంతోపాటు నిత్యం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీసీవో నీరజ, డీఏవో అనురాధ, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, సివిల్ సప్లయిస్ డీఎం సంధ్యారాణి, డీఎస్‌వో కిష్టయ్య పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి
- పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ
- దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో సమావేశాలు

దుగ్గొండి, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని, రాబోయే స్థానిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పిలుపునిచ్చారు. మండలంలోని గిర్నిబావిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి ఎర్రబెల్లి స్వర్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూఊ.. నర్సంపేట నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను నియోజకవర్గ ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పీసీసీ సభ్యుడు పెండెం రామానందం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొకల శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రెల బాబు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగి నర్సింగరావు, మండల ప్రధాన కార్యదర్శి ఎర్రెల్లి శ్రీనివాస్‌రెడ్డి, చుక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.


నల్లబెల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి, చిత్రంలో స్వర్ణ

సంస్థాగత ఎన్నికల్లో సైనికుల్లా పని చేయాలి : దొంతి

సంస్థాగత ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేసి విజయం సాధించాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పిలుపునిచ్చారు. నల్లబెల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సంస్థాగత ఎన్నిల సన్నాహక సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరి కృషితో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం సఫలకృతమైందన్నారు. అదే స్ఫూర్తితో స్థానిక ఎన్నికల్లో అందరూ సమన్వయం పాటించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు నాంది పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, కిసాన్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, శివారెడ్డి, రఘుతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- శాంతి భద్రతలను పాటించాలి
- సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- జనగామ ఏసీపీ కార్యాలయం, చిలుపూర్ పీఎస్‌ల పరిశీలన

6


జనగామలోని ఏసీపీ కార్యాలయంలో సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న సీపీ

రాబోయే ఎన్నికల్లో సత్తా చాటుదాం



మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

రాయపర్తి, మే 16 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుదామని కాంగ్రెస్‌పార్టీ పాలకుర్తి ఎమ్మెల్యే యశ స్వినీరెడ్డి, జిల్లా పరిశీలకుడు మేడి రవిచంద్ర అన్నారు. శుక్రవారం మండ లంలోని కిష్టాపురం క్రాస్ రోడ్డు వద్ద గల వీఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీగెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అపూర్వమైన చరిత్ర ఉన్న పార్టీ గెలుపు కోసం కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి వెన్నముకగా నిలిచే వారందరినీ పార్టీ గుర్తు పెట్టుకుని న్యాయం చేస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలు మాట్లాడుతూ చైతన్యానికి ప్రతీకగా ఉన్న వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి చూపెడుతుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టీబీ నయం కావడం లేదని వ్యక్తి ఆత్మహత్య



హనుమంతు (ఫైల్)

గీసుగొండ, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన గొడుగు హనుమంతు (39) అనే వ్యక్తి తనకు గల వ్యాధి నయం కావటంలేదనే మానసిక వేదనతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చేటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమంతు కొద్దినెలలుగా ట్యూబర్‌క్లోసిస్(టీబీ)తో బాధపడుతున్నాడు. కొద్ది సంవత్సరాలుగా సంగెం మండలం కుంటపల్లిలో అత్తగారింటిలో ఉంటున్నాడు. అయితే హనుమంతు తల్లి 5వ సంవత్సర మాసికానికి మచ్చాపూర్‌కు బుధవారం వచ్చాడు. ఇక్కడే ఉంటున్న హనుమంతు టీబీ ట్రీట్‌మెంట్‌కు డబ్బులులేవని ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

నేడు గురిజాలలో రైతు ముంగింట్లో శాస్త్రవేత్తలు

నర్సంపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గురిజాల గ్రామ రైతు వేదికలో నేడు (శనివారం) రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని వరంగల్ శాస్త్రవేత్తలతో నిర్వహించనున్నట్లు ఏఈవో మెండు అశోక్ శుక్రవారం తెలిపారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో గురిజాల, చిన్నగురిజాల, గుంటూరుపల్లె, జీజీఆర్ పల్లె గ్రామాల రైతులు పాల్గొనాలని కోరారు.

జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

• వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

వర్ధన్నపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక, కర్షకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని శ్రామిక వర్గాల పోరాట స్పూర్తిని ఎలుగెత్తి చాటుదామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి పిలుపు నిచ్చారు. శుక్రవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో జూలై 9న దేశ వ్యాప్తసార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా బీజేపీ ప్రభుత్వ పాలనలో కార్మికులు, కర్షకుల జీవన ప్రమాణాలు పడిపోయాయన్నారు. అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెంచిన ప్రభుత్వాలు శ్రామికులకు తగిన వేతనాలు పెంచకపోవడంతో ఆర్థికపరమైన అవస్థలను ఎదుర్కొంటూ దుర్భరమైన జీవితాలను గడపాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉద్యోగ, ఉపాధి, ఆరోగ్య భద్రత కరువైందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మిక లోకానికి ఇచ్చిన హామీలన్నింటిని చిత్తశుద్ధితో అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మోడి ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలికి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అందించాలని, రైతులు పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర గ్యారెంటి చట్టాన్ని తీసుకురావాలని, పని గంటల పెంపుదలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు విద్యార్థులు మేధావులు అన్ని వర్గాల ప్రజలు క్రియాశీలక భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా నాయకులు సాబిరికాని మోహన్, ఐరన్ అండ్ హార్డ్‌వేర్ కార్మికులు కుమారస్వామి, చందు, నరసింహస్వామి, రాములు, ప్రకాష్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి ఎద్దడి లేకుండా

ప్రత్యామ్నాయ చర్యలు

మోడెం శ్రీధర్‌గౌడ్, ఎంపీవో, దుగ్గొండి

ఫటా ఫట్



ఆంధ్రజ్యోతి : వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీవో : మండలంలోని 34 గ్రామ పంచాయతీలలో ప్రజలకు తాగు నీటి ఎద్దడి లేకుండా కట్టుదిట్టమైన చర్యలతో పాటు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : తాగు నీటి సమస్య లేకుండా తీసుకునే చర్యలు ఏమిటి?

ఎంపీవో : గ్రామాల్లోని తాగు నీటి వనరులను గుర్తించి అవి పని చేసే విధంగా చర్యలు తీసుకున్నాం. జీపీ వనరులైన బావులు, బోరులు, మిషన్ భగీరథ నీటిని కలపి గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో ప్రధానంగా నీటి సమస్యను ఏర్పడిన గ్రామాలు ఏవీ? ఆ గ్రామాల్లో చేపట్టిన చర్యలు ఏమిటి?

ఎంపీవో : మండలంలోని దేశాయిపల్లి, రెబల్లె, మద్రిపల్లి గ్రామాల్లో నీటి సమస్య రాగా, ఆ గ్రామాల్లో వ్యవసాయ బావులను అద్దెకు తీసుకుని నీటిని గ్రామ ప్రజలకు సరఫరా అందిస్తున్నాం. గ్రామాలకు చెందిన కార్యదర్శులను అప్రమత్తం చేసి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం.

ఆంధ్రజ్యోతి : గ్రామాల్లో పారిశుధ్యం నివారణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీవో : గ్రామాల్లో తాగు నీటి బావులు, సరఫరా చేసే ట్యాంకులను క్లోరినేషన్ చేస్తున్నాం. ఎప్పటికపుడు మల్టీపర్పస్ వర్కర్లచే పారిశుధ్య నివారణకు నిరంతరం పనులు చేస్తున్నాం. వారానికి రెండు సార్లు ఓహెచ్‌ఆర్ ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నాం.

- ఆంధ్రజ్యోతి (దుగ్గొండి)

తాను మరణిస్తూ.. ఆరుగురికి పునర్జన్మ

అవయవదానంపై అవగాహన సంస్మరణ సభ



రమణ తల్లిదండ్రులను సన్మానిస్తున్న దృశ్యం

వర్ధన్నపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): తాను మరణిస్తూ మరో ఆరుగురికి పునర్జన్మ కల్పించిన సంఘటన వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని నీలగిరిస్వామి తండాకు చెందిన బానోతు రమణ గత నె 25న ప్రమాదానికి గురై 26న హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మే 2న బ్రెయిన్ డెత్ అయ్యాడు. పుట్టెడు దుఖంలో ఉన్న తల్లిదండ్రులు బానోతు దేవేందర్-విజయలను జీవన్ డాన్ వైద్యులు, సిబ్బంది ఆభాగ్యుల రక్షణ నిమిత్తం అవయవ దానం చేయాలని కోరగా, వారు సమ్మతించి మృతుని కాలేయం, రెండు కిడ్నీలు, రెండు నేత్రాల దానం చేయడంతో ఆరుగురికి పునర్జన్మను ఇచ్చినవాడైనాడు. శుక్రవారం తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వారి ఇంటి ముందు సంస్మరణ సభ నిర్వహించి అభాగ్యులకు ప్రాణం పోసిన మృతుడి ఆత్మ శాంతికై మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించి జోహార్లు అర్పించారు. ఆ కుటుంబాన్ని శాలువాతో సత్కరించి ధన్యవాదలు తెలిపి ఆవయవదాన అభినందన పత్రం అందించారు. హాజరైన బంధుమిత్రులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ మరణాంతరం సహజంగా మరణిస్తే 6గంటలలోపు నేత్ర దానం చేసి ఇద్దరి అందులకు చూపునిద్దాం అన్నారు. పార్థివదేహం దానం చేసి భావి వైద్యులకు వైద్య పాఠం అవుదామని, బ్రెయిన్ డెత్ అయితే అవయవదానం చేసి మరి కొందరికి పునర్జన్మనిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పెల్లి ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు మునగల పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శులు జనార్ధన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఆర్ఎంపి సీతాలే చంద్రశేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించేందుకు సహకారం

• సహవికాస సంస్థ అధ్యక్షురాలు జయప్రద



గవిచర్లలో మాట్లాడుతున్న కాసర్ల జయప్రద

సంగెం, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటైన పొదుపు సంఘాల ఆర్థికాభివృద్ధి సాధించేందుకు సహవికాస సంస్థ తగిన సహకారం అందిస్తుందని సంస్థ అధ్యక్షురాలు కాసర్ల జయప్రద అన్నారు. శుక్రవారం మండలంలోని గవిచర్ల గ్రామంలోని శ్రీఆంజనేయ పురుషుల పొదుపు సమితి ప్రథమ వార్షికోత్సవ సమావేశం సమితి అధ్యక్షుడు గుండెబోయిన ఎల్లగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గవిచర్లలోని శ్రీఆంజనేయ పురుషుల పొదుపు సమితి పరిధిలో రాంచంద్రాపురం, లోహిత, ఆశాలపల్లి, కాపులకనపర్తి గ్రామాల్లో గల పురుషుల పొదుపు సంఘాలను విలీనంచేసి వాటి ఆర్థికపరమైన విషయాలపై తగిన సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. సమితి పరిధిలో గల సంఘాల్లో 333 మంది సభ్యుల ద్వారా సుమారు రూ.5 కోట్ల 29 లక్షల11వేల నియమిత పొదుపులు, బోనస్ ద్వారా రూ.7 కోట్ల 90 లక్షల వరకు సభ్యుల నిధులు ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ లక్ష్మణ్, డీవో నవీన్, పలు సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి ఎంఈవోగా శ్రీనివాస్



వి.శ్రీనివాస్

రాయపర్తి, మే 16 (ఆంధ్రజ్యోతి) : రాయపర్తి మండల విద్యాశాఖ అధికారిగా వి.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని ఊకల్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎంగా పని చేస్తున్న శ్రీనివాస్‌ను జిల్లా విద్యాశాఖ రాయపర్తి ఎంఈవోగా నియమించింది. ఈ మేరకు ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అలవాల శ్రీనివాస్, సీసీవో జెరిపోతుల యాకయ్య, ఐత శ్రీనివాస్, సీఆర్పీ వెంకన్న తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

బాధితులకు ఆర్థిక సాయం

రాయపర్తి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన ఐత సునీల్ కుమారుడు సిద్ధు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కాగా, శుక్రవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో నగదు అందించి అండగా నిలిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేతాకుల రంగారెడ్డి, మాజీ సర్పంచ్ గారె నర్సయ్య, ఐత రాంచందర్, చందు రామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గోవులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

రాయపర్తి, మే 16 (ఆంధ్రజ్యోతి): గోవులను అక్రమంగా కబేళాలకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని రాయపర్తి ఎస్ఐ శ్రవణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై పోలీస్ స్టేషన్ సమీపంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ సీపీ ఆదేశాల మేరకు బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణా చేయొద్దని తెలిపారు. రవాణాచేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వచ్చే నెల బక్రీద్ పండుగ ఉన్నందున ఇప్పటినుంచే కట్టడి చేసేందుకు చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు.

హనుమాన్ మాలధారుల పాదయాత్ర



నెక్కొండకు చేరిన హనుమాన్ భక్తుల పాదయాత్ర

నెక్కొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ మాలధారుల పాదయాత్ర శుక్రవారం నెక్కొండకు చేరుకుంది. మండలంలోని దీక్షకుంట గ్రామానికి చెందిన హనుమాన్ భక్తులు పది మంది గురుస్వామి అక్కిపల్లి వెంకటేశ్ ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని భద్రాచలం బయలుదేరారు. ఐదు రోజులు 180 కిలో మీటర్ల పాదయాత్ర చేసి భద్రచలం చేరుకుని శ్రీసీతా రామస్వామిని దర్శించుకుంటామన్నారు. ఈ నెల 22న జరిగే హనుమాన్ జయంతి సందర్భంగా మొక్కులు చెల్లించుకుంటామని భక్తులు తెలిపారు. ఈ పాదయాత్రలో పొనకంటి స్వామి, అక్కినపల్లి సిద్దార్థ, పొగాకు రమేశ్, మండల మహేశ్, మనుబోతుల శివాజి, రవి, హరినాథ్, వెంకన్న, రాజులు పాల్గొన్నారు.

హనుమాన్ భక్తులకు అన్నదానం

చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లి గ్రామంలో శుక్రవారం హనుమాన్ భక్తులకు అమీనాబాద్ సొసైటీ డైరెక్టర్ భూక్య హుస్సేన్‌నాయక్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దొంతరబోయిన కొమ్మాలు, రమేశ్, తిలక్, నరేశ్, వెంకటేశ్వర్లు, రాంచరణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడికి ఆదరణ కరువు కావొద్దు

• కూలీతో ప్రభుత్వ బడిపై అవగాహన



ల్యాబర్తిలో మాట్లాడుతున్న ఉపాధిహామీ కూలీ ఎర్రం సుశీల

వర్ధన్నపేట రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడికి ఆదరణ కరువుకాకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామస్థులుగా, తల్లిదండ్రులుగా తమపై ఉందంటూ ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీ ఎర్రం సుశీల, సంకినేని రజిత, చిదుముల వెంకటేశ్వర్లు స్పష్టంచేశారు. శుక్రవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తి గ్రామంలో కరువు పని జరిగే చోటకు వెళ్లి ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ల్యాబర్తి పాఠశాలలో దాతల సహకారంతో జరుగుతున్న అభి వృద్ధిని గుర్తు చేస్తూ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచితేనే బడికి భవిష్యత్తు ఉంటుందని కూలీలు అభిప్రాయ పడ్డారు. కూలీలు ఉపాధ్యాయుల ఈ ప్రయత్నాన్ని ప్రశంసించారు. పనిచేసే చోటకు వచ్చి మా పిల్లల చదువు గురించి మాట్లాడడం ఎంతో ప్రేరణను కలిగిస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వేణు కుమార్ మాట్లాడుతూ గ్రామస్థుల సహకారంతో ఉంటేనే ఉపాధ్యాయులు మెరుగ్గా పనిచేసి, విద్యార్థుల నుంచి మంచి ఫలితాలు వచ్చేలా చేస్తారని తెలిపారు. నిబద్ధతతో పనిచేసే వారిని చూస్తున్నారని, పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిలాల్, రఘువీర్, వెంకటస్వామి, ప్రభాకర్, ముత్తయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి

ఖానాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) : దోమల వ్యాప్తిని అరికట్టాలని మండల వైద్యాధికారి డాక్టర్ జ్యోతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగ్యూ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలను వాడాలను సూచించారు. అధిక జ్వరం, తీవ్రమైన కీళ్ల, కండరాల నొప్పి, చర్మంపై దద్దుర్లు ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజయ్య, లీలా, నంద, దామోదర్‌రెడ్డి, దేవిక, చిన్ని సబిత, శ్రీనివాసచారి, భాస్కర్, భద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల చట్టాలపై అవగాహన

నెక్కొండ, మే 16 (ఆంధ్రజ్యోతి) : మహిళలు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వరంగల్ సఖీ సెంటర్ కేస్ వర్కర్స్ తిరుమల, స్వప్న అన్నారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని మహిళ సంఘాలకు, ఉపాధిహామీ కూలీలకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, మహిళలు, బాలికలకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. అత్యవసర పరిస్థితులలో రక్షణకు చేయాల్సిన టోల్ ఫ్రీ నెంబర్ల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ శారద. వీవోఏ సదానందచారి, ఏఫ్ఏ కుమారస్వామి, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు సన్మానం



ప్రయాణికులను సన్మానిస్తున్న డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి

నర్సంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : కర్టసీ డే సందర్భంగా నర్సంపేట బస్టాండ్‌లో రెగ్యులర్‌గా ప్రయాణించే నర్సంపేటకు చెందిన చల్ల సోమ నర్సయ్య, కమలాపురానికి చెందిన ముత్తినేని శ్రీలతలకు గులాబీ పుష్పాలను అందించి శాలువాలతో డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి శుక్రవారం సన్మానించారు. అనంతరం డిపో ఉద్యోగులకు గేట్ మీటింగ్ నిర్వహించి ప్రయాణికులను చిరునవ్వులతో పలకరించి వారిపట్ల మర్యాదపూర్వకంగా ఉండాలని మేనేజర్ సూచించారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన కండక్టర్ యాదగిరిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

• అరకొర వసతులతో సిబ్బంది అవస్థలు

• సొంత స్థలాలున్నా నిర్మాణాలకు నోచుకోని వైనం



ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన శిలాఫలకం (ఫైల్)



అద్దె భవనంలో నర్సంపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్

నర్సంపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అవసరాలను తీర్చే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు కొలువై ఉండే ప్రభుత్వ కార్యాలయాలు అద్దె గదుల్లో, అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయి. ఏళ్ల గడుస్తున్నా సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. నిత్యం వందలాది మంది ప్రజలు తమ పనులకోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. అధికారులతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు అత్యవసరాలను తీర్చుకోలేని దుస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోనే ప్రధానమైన నర్సంపేట పట్టణంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఎక్సైజ్ ఆఫీస్, లేబర్ ఆఫీస్, ట్రాన్స్‌కో బిల్లుల చెల్లింపు కార్యాలయం, డీఈ కార్యాలయాలు దశాబ్దాల కాలంగా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని ఉన్న చందంగా నర్సంపేట పట్టణంలో మూతపడిన ప్రభుత్వ పాఠశాల భవనాలు, ప్రభుత్వ స్థలాలు, నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్ భవనాలు ఉన్నా ప్రభుత్వ కార్యాలయాలు అద్దెభవనాల్లో కొనసాగుతు న్నాయంటే పాలకులకు ప్రభుత్వ వనరులపై చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థమవుతుంది.



అద్దె భవనంలో నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

శిలాఫలకానికే పరిమితం

2018లో ఆనాటి ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవన నిర్మాణానికి పట్టణంలోని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో శిలాఫలకం వేసి చేతులు దులుపుకున్నారు. నిధులు విడుదల చేయకపోవడం వల్ల భవన నిర్మాణం పనులు శిలాఫలకానికే పరిమితమయ్యాయి. సొంత స్థలం ఉన్నప్పటికీ భవన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంవల్ల ఏళ్లుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దెభవనాల్లోనే కొనసాగుతున్నది.

భవనం దొరకక అవస్థలు

ఇటీవల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అద్దె భవనం నుంచి సొంత భవనంలోకి మార్చేందుకు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల కోసం అధికారులు వెతుకుతున్నట్లు సమాచారం. కాగా, శిలాఫలకం వేసిన సొంత స్థలంలో శాశ్వత భవనాన్ని నిర్మించేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలని అధికారులు, ప్రజలు కోరుతున్నారు.

ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌దీ అదే దారి

అక్రమ మద్యం, గుడుంబా నివారణకు పట్టణంలోని ద్వారకపేటరోడ్‌లో అద్దె భవనంలో నర్సంపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల కిందట పాలకులు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు సొంత భవనానికి పట్టణంలో స్థలాన్ని కేటాయించగా ప్రస్తుతం ఆ స్థలం కోర్టు పరిధిలో ఉందని అధికారులు చెబుతున్నారు.

అరకొర వసతులతో సిబ్బంది ఇక్కట్లు

అద్దె భవనాల్లో అరకొర వసతులతో అధికారులు, ఉద్యోగులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి ప్రతీ ఏడాది లక్షలాది రూపాయలు అద్దెరూపంలో వెళ్తుండడంతో ప్రభుత్వ స్థలాలు, భవనాలు ఉన్నప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగడం వల్ల ప్రతీ ఏటా ప్రజాధనాన్ని వెచ్చించాల్సి వస్తోంది.

వేంకటేశ్వరాలయంలో కొనసాగుతున్న పుష్కర బ్రహ్మోత్సవాలు

ఖానాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధరావుపేట భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్కర బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం చక్రలక్ష్మీదేవి హోమం, స్వామివారి కల్యాణ-ఎదుర్కోళ్ల మహోత్సవం, సామూహిక మహాలక్ష్మి కుంకుమ పూజ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం దేవినేని వేణుకృష్ణ-లక్ష్మి, దేవినేని హరికృష్ణ-స్రవంతి దంపతుల సహకారంతో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. నేడు (శనివారం) ఉదయం 10 గంటలకు భూనీల సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం, మహా అన్నదానం, స్వామివారి రజోత్సవ సేవా, రతాంగ హోమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. హోమ పూజ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు వేణుగోపాలస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ మహాలక్ష్మి వెంకటనర్సయ్య-సుజాత దంపతులు, బిక్కి మురళి-లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలను పరిరక్షించాలి : ఈస్ట్‌జోన్ డీసీపీ

ఖానాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ అన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనఖీచేసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో, పోలీస్ సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. 100 డయల్ కేసుల్లో తక్షణమే స్పందించాలని సూచించారు. అనంతరం ఖానాపురం శివారులో బక్రీద్ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టును పరిశీలించారు. కార్యక్రమంలో నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, రూరల్ సీఐ సాయిరమణ, ఎస్సై రఘుపతి తదితరులు పాల్గొన్నారు.